www.epaper.asthramdaily.com

RNI : TGTEL/25/A1872

సామాన్యుడి అస్త్రం

తెలుగు దిన పత్రిక

సంగారెడ్డి- హైదరాబాద్ | బుధవారం, సెప్టెంబర్ 30. 2026 | ఎడిటర్: పి. జయరాం | సంపుటి: 1 | సంచిక:205 | పేజీలు: 8 | వెల: రూ.5/-

ఓటర్ల జాబితా సవరణ

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఎస్ఆర్) ప్రక్రియలో భాగంగా, ఇప్పటివరకు 48,88,076 మందిని తుది జాబితాలో చేర్చేందుకు అర్హులుగా గుర్తించినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఈ వివరాలను వెల్లడించిన ఆయన, ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియ అత్యంత వేగంగా కొనసాగుతోందని పేర్కొన్నారు.ఓటర్ల జాబితాలోని తప్పులు, ఇతర సాంకేతిక సమస్యల కారణంగా మొత్తం 92,88,180 నోటీసులు జారీ చేయగా, వాటిలో 88,52,173 నోటీసులను ఇప్పటికే ఓటర్లకు చేరవేసినట్లు ఆయన వివరించారు. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్ఓ), సహాయ ఈఆర్ఓల పర్యవేక్షణలో ఇప్పటివరకు 61,87,444 విచారణలు పూర్తయ్యాయని, మరో 12,99,368 నోటీసులు ప్రస్తుతం జిల్లా ఎన్నికల అధికారుల పరిశీలనలో ఉన్నాయని సుదర్శన్ రెడ్డి వెల్లడించారు.

రాజ్యాంగంపై నమ్మకం లేకనే

దళితులపై వివక్ష

- ఖర్గేకు అవమానం దళితుల ఆత్మగౌరవానికి సంబంధించినది
- ఎస్సీ, ఎస్టీలను రెండో తరగతి పౌరులుగా చూస్తున్నారు

ఢిల్లీలో దళిత -- ఆదివాసీ ఆత్మగౌరవ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్ (సామాన్యుడి అస్త్రం)




భారత రాజ్యాంగంపై నమ్మకం లేకపోవడం వల్లే దేశంలో దళితులు, ఆదివాసీలపై వివక్ష కొనసాగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు హల్ద్వానీలో జరిగిన అవమానం ఒక్క వ్యక్తికి సంబంధించినది కాదని.. దేశంలోని దళితుల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని అన్నారు. దళితులు, ఆదివాసీల గౌరవం, హక్కుల పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మంగళవారం ఢిల్లీలో కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ ఎంపీల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన దళిత -- ఆదివాసీ ఆత్మగౌరవ సమావేశంలో భట్టి విక్రమార్క ప్రసంగించారు. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, అస్పృశ్యత నిర్మూలన వంటి విలువలను రాజ్యాంగం దేశానికి అందించిందని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, హామీలను పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘించడం దేశ పునాదులను బలహీనపర్చడమేనని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో దళితులు, ఆదివాసీలపై వివక్షను అరికట్టేందుకు అనేక చట్టాలు తీసుకొచ్చామని తెలిపారు. అయినప్పటికీ ఇప్పటికీ వివక్ష, అవమానాలు కొనసాగడం ఆందోళన కరమన్నారు. రాజ్యాంగం కల్పించిన సమానత్వం, సామాజిక న్యాయం ఆచరణలోనూ అమలయ్యేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఖర్గే కేవలం దళిత నాయకుడు మాత్రమే కాదని, సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో అనేక కీలక పదవులు నిర్వహించిన జాతీయ నాయకుడని.., అలాంటి వ్యక్తి సభలో పాల్గొన్న అనంతరం హల్ద్వానీలో 'శుద్ధీకరణ' కార్యక్రమం నిర్వహించడం తీవ్రంగా అభ్యంతరకరమన్నారు.

సంక్షేమం, అభివృద్ధి

మా మంత్రం

- ఉదయగిరిలో 'పల్లె పండుగ-3' కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ రోడ్ల అభివృద్ధికి రూ.1,185 కోట్లు కేటాయించినట్లు ప్రకటన

పవన్ నాయకత్వంలో పంచాయతీరాజ్ అద్భుతం



అమరావతి (సామాన్యుడి అస్త్రం)

రాష్ట్రంలోని పల్లెల్లో నవోదయానికి నాంది పలుకుతూ ఎన్డీయే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'పల్లె పండుగ-3' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం రామాపురంలో జరిగిన సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన కోసం రూ.11,085 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. డబుల్ ఇంజన్ సర్కార్ జెట్ స్పీడ్‌తో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు

- దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్న పొన్నం
- ఆలయాల అభివృద్ధి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టీకరణ

హైదరాబాద్ (సామాన్యుడి అస్త్రం)

రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడి పేరును వాడుకోవడం సరికాదని, అది ఎవరికీ మేలు చేయదని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రతి వ్యక్తికి తమ తమ దేవతలపై విశ్వాసం ఉంటుందని, ఇతరుల నమ్మకాలను గౌరవించడం భారతీయ సంస్కృతిలో భాగమని ఆయన పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.



దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదు

తిరుమలలో పోటెత్తిన

భక్తులు

- తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ
- సర్వదర్శనానికి 20 నుంచి 24 గంటల సమయం



అమరావతి (సామాన్యుడి అస్త్రం)

తిరుమల శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. మంగళవారం సైతం భారీ సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోవడంతో, క్యూలైన్లు వెలుపల శిలాతోరణం వరకు విస్తరించాయి.టీటీడీ ఎల్లడించిన వివరాల మేరకు, సోమవారం (సెప్టెంబర్ 28) ఒక్కరోజే 84,171 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.అంతకుముందు రోజు కూడా దాదాపు అదే సంఖ్యలో భక్తులు దర్శనం చేసుకోవడం గమనార్హం.



అదుపుతప్పి మాట్లాడితే

మహిళలతో కొట్టిస్తా

మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ

- నోరు అదుపులో పెట్టుకోకపోతే మహిళలతో కొట్టిస్తానన్న కొండా సురేఖ
- వరంగల్‌లో ప్రతిపక్ష నేతలకు, పార్టీలోని కొందరికి హెచ్చరిక

హైదరాబాద్ (సామాన్యుడి అస్త్రం)

మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ తనదైన శైలిలో రాజకీయ ప్రత్యర్థులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. మంగళవారం వరంగల్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, నోరు అదుపులో పెట్టుకోకపోతే మహిళలతో దేహశుద్ధి చేయిస్తానని ఘాటుగా హెచ్చరించారు.కొంతమంది నేతల తీరుపై కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇష్టానుసారం మాట్లాడితే మహిళలతో చిత్తుచిత్తుగా కొట్టిస్తాం. ఒక్కో మహిళ నలుగురిని కొడుతుంది, జాగ్రత్త. ప్రతిపక్ష నేతలు గాలిలో కత్తులు తిప్పుతున్నారు" అంటూ ఆమె ధ్వజమెత్తారు. కొందరు నేతలు తమ హద్దులు మీరుతున్నారని, అలాంటి వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.



భారత రైల్వేలో సరికొత్త

ప్రయోగం

- భారతదేశపు తొలి ఎల్ఎన్‌జీ ఆధారిత రైలు సేవలు ప్రారంభం
- అహ్మదాబాద్‌లో జెండా ఊపి ప్రారంభించిన కేంద్ర మంత్రి అమిత్ షా

న్యూఢిల్లీ(సామాన్యుడి అస్త్రం)

భారతీయ రైల్వే చరిత్రలో మరో కీలక ఘట్టం నమోదైంది. దేశంలోనే తొలిసారిగా ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జీ)తో నడిచే రైలును ప్రవేశపెట్టారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఉన్న సబర్మతి రైల్వే స్టేషన్‌లో ఈ నెల 27న కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ రైలును జెండా ఊపి ప్రారంభించారు.సబర్మతి నుంచి మెహసానా మధ్య ఈ రైలు తన తొలి ప్రయాణాన్ని పూర్తిచేసుకుంది.

నైపుణ్యాలే అభివృద్ధికి చోదకశక్తి

- విజయవాడలో మిషన్ కర్మయోగి దక్షిణాది రాష్ట్రాల సదస్సు
- ఉద్యోగుల సామర్థ్యాల పెంపులో ఏపీకి దేశంలోనే ప్రథమ స్థానం

అమరావతి (సామాన్యుడి అస్త్రం)



దేశాభివృద్ధిలో రాబోయే రెండు దశాబ్దాలు అత్యంత కీలకమని, ప్రజల మారుతున్న ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ పాలనా వ్యవస్థల్లో విప్లవాత్మక మార్పులు రావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. నైపుణ్యాభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారానే ఇది సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. విజయవాడలో మంగళవారం నిర్వహించిన "మిషన్ కర్మయోగి" దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సదస్సును ముఖ్యమంత్రి ప్రారంభించి ప్రసంగించారు.

ఏపీలోని 6 జిల్లాలకు

వర్ష సూచన

అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

అమరావతి (సామాన్యుడి అస్త్రం)



ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో వాతావరణం ఒక్కసారిగా మారింది. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

గ్రామసీమల అభివృద్ధికి 'పల్లె పండుగ 3.0'

- రూ.11,085 కోట్ల భారీ బడ్జెట్‌తో 'పల్లె పండుగ 3.0' ప్రారంభం
- నెల్లూరు జిల్లాలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేతుల మీదుగా శ్రీకారం

అమరావతి (సామాన్యుడి అస్త్రం)



ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'పల్లె పండుగ 3.0' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నెల్లూరు జిల్లా రామాపురం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ బృహత్ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. మొత్తం రూ.11,085 కోట్ల భారీ అంచనాలతో ఈ పథకం ద్వారా గ్రామాల్లో మౌలిక వసతులను సమగ్రంగా మెరుగుపరచనున్నారు.

నిమ్స్ ఉద్యోగుల ఇళ్లలో ఏసీబీ తనిఖీలు

తాజా తనిఖీల్లో రూ.7 లక్షల నగదు స్వాధీనం

హైదరాబాద్ (సామాన్యుడి అస్త్రం)



హైదరాబాద్‌లోని నిమ్స్ (నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడి కల్ సైన్సెస్) ఆసుపత్రి అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నూరిలక్ష్మీ భాస్కర్ అక్రమాస్తుల కేసులో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దర్యాప్తును ముమ్మరం చేసింది.
ఈ కేసు విచారణలో భాగంగా ఈ ఉదయం నిమ్స్‌లోని పలువురు ఉద్యోగుల ఇళ్లలో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు.

భాద్రవిప్రా TRAI

స్పామ్ కాల్స్‌పై ట్రాయ్

ఉక్కుపాదం

న్యూఢిల్లీ(సామాన్యుడి అస్త్రం)

అనవసర స్పామ్ కాల్స్‌తో విసిగిపోతున్న మొబైల్ వినియోగదారులకు ఊరటనిచ్చేలా టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందకపోయినా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికత సాయంతో స్పామ్ కాల్స్‌కు అడ్డుకట్ట వేయాలని టెలికాం సంస్థలను ఆదేశించింది.

రాజ్యాంగంపై నమ్మకం లేకనే దళితులపై వివక్ష

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు జరిగిన అవమానాన్ని నిరసిస్తూ... దళితులు, ఆదివాసీల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు దేశవ్యాప్తంగా ఐక్య పోరాటం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. మంగళవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఎంపీ మల్లు రవి నేతృత్వంలో కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ ఎంపీల ఫోరం ఆధ్వర్యంలో దళిత-ఆదివాసీ ఆత్మగౌరవ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు వివేక్ వెంకటస్వామి, సీతక్క, ఎంపీలు బల్‌రామ్ నాయక్, గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. మల్లికార్జున ఖర్గే దేశంలో అత్యున్నత పదవులను నిర్వహించిన నాయకుడని, అలాంటి నేత సభ అనంతరం హల్వానీలో 'శుద్ధీకరణ ' చేయడం దళితుల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని భట్టి పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలోనే అస్పృశ్యతకు వ్యతిరేకంగా తొలి తీర్మానం ఆమోదించారని ఆయన గుర్తు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి రాజ్యాంగంపై నమ్మకం లేదనిని... మను ధర్మశాస్త్ర



భావజాలాన్ని ప్రోత్సహించాలనే ఆలోచనతో ఆ పార్టీ వ్యవహరిస్తోందన్నారు. దళితులు, ఆదివాసీలపై వివక్షకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే పలు చట్టాలు తెచ్చామని చెప్పారు. ఖర్గేకు జరిగిన ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ రాహుల్ గాంధీ నిరసన చేపడితే... బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి ఆయనపైనే కేసు పెట్టారని భట్టి విమర్శించారు. "ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలను ద్వితీయ శ్రేణి పౌరులుగా చూసే పరిస్థితిని మనం అంగీకరించకూడదు. అందరం ఒక్కతాటిపైకి వచ్చి ఆత్మగౌరవం కోసం పోరాడాలి" అని పిలుపునిచ్చారు.

రాహుల్‌పై కేసు ఎందుకు?

ఖర్గేకు జరిగిన ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కోరుతూ నిరసన చేపట్టారని భట్టి తెలిపారు. అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన సమయంలో రాహుల్ గాంధీపైనే కేసు నమోదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. అవమానానికి గురైన వ్యక్తికి న్యాయం చేయాలని కోరిన వారిపైనే కేసులు పెట్టడం సరైన విధానం కాదన్నారు. ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలను రెండో తరగతి పౌరులుగా చూసే పరిస్థితిని అంగీకరించబోమని స్పష్టం చేశారు. సామాజిక వివక్షకు వ్యతిరేకంగా అన్ని వర్గాలు ఒక్కతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. 'ప్రతి రాష్ట్రానికి వెళ్దాం.. ప్రజలను చైతన్యపరుద్దాం.. మన ఆత్మగౌరవం కోసం పోరాడుదాం. ఎలాంటి అవమానాన్ని సహించబోం' అని అన్నారు. దళితులు, ఆదివాసీలు, బలహీన వర్గాల హక్కులను కాపాడేందుకు ఐక్యంగా నిలబడాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం, సమానత్వం కోసం నిరంతర పోరాటం కొనసాగించాలని భట్టి పేర్కొన్నారు.

దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు: మంత్రి పొన్నం ప్రభాకర్

మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలోని దేవాలయాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. వేములవాడ రాజన్న, భద్రాద్రి రాముడు, కొండగట్టు అంజనేయ స్వామి సహా అన్ని ఆలయాల పట్ల తనకు గౌరవం, విశ్వాసం ఉన్నాయని చెప్పారు. వ్యక్తిగతంగా తనకు శివుడు ఆరాధ్య దైవమని ఆయన పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాలను ప్రభుత్వం గౌరవిస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని అన్నారు.

డాక్టర్ భాస్కర్ కేసు.. నిమ్స్ ఉద్యోగుల ఇళ్లలో ఏసీబీ తనిఖీలు

మొదటి పేజీ తరువాయి

నిమ్స్‌లోని ఇతర ఉద్యోగుల నివాసాల్లో ఏసీబీ అధికారుల సోదాలు

తాజా తనిఖీల్లో రూ.7 లక్షల నగదు స్వాధీనం

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఇటీవల అరెస్ట్ అయిన డాక్టర్ భాస్కర్‌కు కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో, ఆయన్ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. గతంలో ఆయన నివాసంతో పాటు బంధువులు, బినామీల ఇళ్లలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేశారు. ఏసీబీ ప్రాథమిక అంచనాల ప్రకారం, ఇప్పటివరకు గుర్తించిన ఆస్తుల పత్రాల విలువ రూ. 6.13 కోట్లుగా ఉండగా, బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ రూ. 80 కోట్ల నుంచి రూ. 100 కోట్ల వరకు ఉండొచ్చని భావిస్తున్నారు. 517.8 గ్రాముల బంగారు ఆభరణాలు, జాగ్వార్, ఆడి, టాటా నెక్సాన్ వంటి లగ్జరీ కార్లతో పాటు పలు ఫ్లాట్లు, విశాఖపట్నం సహా తెలంగాణలోని ఇతర ప్రాంతాల్లో ఓపెన్ ప్లాట్లను గుర్తించారు.సుమారు రూ. 41 లక్షల బ్యాంకు డిపాజిట్లు, రూ. 12 లక్షల పోస్టాఫీస్ డిపాజిట్లు, రూ. 64.55 లక్షల ప్రైవేట్, మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులను అధికారులు కనుగొన్నారు. ఆసుపత్రి అడ్మిషన్లు, ల్యాబ్ పరికరాల కొనుగోళ్లు, కమీషన్ల రూపంలో డాక్టర్ భాస్కర్ అక్రమాలకు పాల్పడి ఈ ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ ఆరోపిస్తోంది. ఈ కేసులో ఇతర ఉద్యోగుల ప్రమేయంపైనా అధికారులు దృష్టి సారించి విచారణ వేగవంతం చేశారు.

తిరుమలలో పోటెత్తిన భక్తులు..

మొదటి పేజీ తరువాయి

టీటీడీ వెల్లడించిన వివరాల మేరకు, సోమవారం (సెప్టెంబర్ 28) ఒక్కరోజే 84,171 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అంతకుముందు రోజు కూడా దాదాపు అదే సంఖ్యలో భక్తులు దర్శనం చేసుకోవడం గమనార్హం. సోమవారం నాడు 36,671 మంది భక్తులు తలనీలాలు సమర్పించగా, శ్రీవారి హుండీ కానుకల ద్వారా రూ. 4.26 కోట్ల ఆదాయం లభించినట్లు అధికారులు తెలిపారు.అదేవిధంగా, సోమవారం నాడు 4.16 లక్షల లడ్డూలను విక్రయించగా, 2.61 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. అశ్విని ఆసుపత్రిలో 3,926 మందికి వైద్య సేవలు అందించినట్లు టీటీడీ పేర్కొంది. ప్రస్తుత రద్దీ దృష్ట్యా, టైమ్ స్లాట్ టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి సుమారు 20 నుంచి 24 గంటల సమయం పట్టవచ్చని టీటీడీ అంచనా వేస్తోంది. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు ఈ విషయాన్ని గమనించి, తదనుగుణంగా తమ ప్రయాణ ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



అదుపుతప్పి మాట్లాడితే మహిళలతో కొట్టిస్తా: కొండా సురేఖ

మొదటి పేజీ తరువాయి

కొంతమంది నేతల తీరుపై కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇష్టానుసారం మాట్లాడితే మహిళలతో చిత్తుచిత్తుగా కొట్టిస్తాం. ఒక్కో మహిళ నలుగురిని కొడుతుంది, జాగ్రత్త. ప్రతిపక్ష నేతలు గాలిలో కత్తులు తిప్పుతున్నారు" అంటూ ఆమె ధ్వజమెత్తారు. కొందరు నేతలు తమ హద్దులు మీరుతున్నారని, అలాంటి వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.అదే సమయంలో పార్టీ అంతర్గత పరిణామాలపైనా ఆమె స్పందించారు. కాంగ్రెస్ నేతలంతా విభేదాలను పక్కన పెట్టి, పార్టీ బలోపేతం కోసం సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులంతా ఐక్యంగా ఉంటేనే పార్టీ ప్రగతి పథంలో ముందుకు సాగుతుందని ఆమె సూచించారు.

సంక్షేమం, అభివృద్ధి మా మంత్రం

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "2024 ఎన్నికల్లో ప్రజలు మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం. మీరు వేసిన ఒక్క ఓటు కూడా వృథా కాలేదు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టాం. నా అనుభవం, పవన్ కల్యాణ్ గారి ఉత్సాహం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం" అని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాలు విధ్వంసానికి గురయ్యాయని, రోడ్లు గుంతలమయమై, వీధి దీపాలు వెలగని దుస్థితి ఉండేదని ఆయన విమర్శించారు.

గ్రామీణ రోడ్ల నిర్మాణంలో రికార్డు

'పల్లె పండుగ-3'లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 15,500 కిలోమీటర్ల బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని సీఎం వివరించారు. మరో రూ.2,700 కోట్లతో 6,000 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు నిర్మిస్తామని, ప్రతి ఇంటి ముందూ బురద లేని రోడ్లు ఉండేలా చూస్తామని హామీ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 880 కిలోమీటర్ల రోడ్లు వేస్తే, తమ ఎన్డీయే ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే 6,500 కిలోమీటర్ల రోడ్లు వేసి చరిత్ర సృష్టించిందని పోల్చి చెప్పారు. "అప్పుడు ఖర్చుపెట్టిన డబ్బులు దొంగల జేబుల్లోకి పోయాయి, ఇప్పుడు మేము ఖర్చుపెట్టే ప్రతి పైసా మీ ఊరిలో అభివృద్ధి రూపంలో కనిపిస్తోంది," అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

పవన్ నాయకత్వంలో పంచాయతీరాజ్ అద్భుతం

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పంచాయతీరాజ్ శాఖ అద్భుతమైన మార్పులు తీసుకొచ్చిందని సీఎం ప్రశంసించారు. రెండున్నర దశాబ్దాల తర్వాత 10,000 మందికి పదోన్నతులు కల్పించడం, నిలిచిపోయిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4,136 కోట్లు విడుదల చేయించడం వంటి విజయాలను ఆయన గుర్తుచేశారు. పంచాయతీరాజ్ శాఖకు 13 జాతీయ అవార్డులు రావడం పవన్ పనితీరుకు నిదర్శనమని కొనియాడారు.

ఉదయగిరికి వరాల జల్లు

ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి పలు కీలక ప్రాజెక్టులను ముఖ్యమంత్రి మంజూరు చేశారు. 65,000 ఎకరాలకు సాగునీరు అందించే పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ కాలువ పనులకు రూ.52.52 కోట్లు.
90,000 ఎకరాలకు సాగునీరు, 2.35 లక్షల మందికి తాగునీరు అందించే సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్-1 భూసేకరణకు రూ.85 కోట్లు.
రూ.3,876 కోట్ల పెట్టుబడితో 5,100 మందికి ఉద్యోగాలిచ్చే డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా ఉదయగిరిని తీర్చిదిద్దేందుకు అవసరమైన క్లియరెన్సులు.
కనిగిరిలోని 189 ఫ్లోరైడ్ గ్రామాల సమస్య పరిష్కారానికి రూ.100 కోట్లు.
వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-2ను పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు.

సంక్షేమం, అభివృద్ధి మా మంత్రం

ఎన్నికల్లో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను నిలబెట్టుకున్నామని చంద్రబాబు తెలిపారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, రూ.4,000 పెన్షన్ వంటి పథకాలతో ప్రజలకు అండగా నిలుస్తున్నామన్నారు.

గ్రామసీమల అభివృద్ధికి 'పల్లె పండుగ 3.0'

మొదటి పేజీ తరువాయి

15,500 కిలోమీటర్ల గ్రామీణ రోడ్ల నిర్మాణానికి రూ.10,250 కోట్లు కేటాయింపు

పాడి రైతుల కోసం మినీ గోకులాలు, మ్యాజిక్ డ్రైన్లు, ఉద్యానవనాల ఏర్పాటు

గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యమన్న ప్రభుత్వం

ఈ కార్యక్రమంలో సింహభాగం నిధులను గ్రామీణ రహదారుల నిర్మాణానికి కేటాయించారు. మొత్తం రూ.10,250 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15,500 కిలోమీటర్ల మేర రోడ్లను నిర్మించనున్నారు. ఇందులో రూ.7,550 కోట్ల వ్యయంతో 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్లు, రూ.2,700 కోట్లతో 6,000 కిలోమీటర్ల సీసీ రోడ్లు ఉన్నాయి.రహదారులతో పాటు, గ్రామీణ ప్రజల జీవనోపాధిని, జీవన ప్రమాణాలను మెరుగుపరిచే పలు ఇతర పనులకు కూడా ప్రభుత్వం నిధులు కేటాయించింది. పాడి రైతులను ప్రోత్సహించేందుకు రూ.300 కోట్లతో 22,000 మినీ గోకులాలు (పశువుల షెడ్లు), పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు రూ.110 కోట్లతో 1,000 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రైన్లు, పచ్చదనం పెంపు కోసం రూ.225 కోట్లతో 50,000 ఎకరాల్లో ఉద్యానవనాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇవే కాకుండా, గ్రామ పంచాయతీ భవనాలు, బస్ షెల్టర్లు, రచ్చబండల నిర్మాణం, భూగర్భ డ్రైనేజీ వంటి ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.200 కోట్లు కేటాయించారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊతమివ్వడంతో పాటు, ప్రజల భాగస్వామ్యంతో ఈ అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

ఏపీలోని 6 జిల్లాలకు వర్ష సూచన..

మొదటి పేజీ తరువాయి

విపత్తుల నిర్వహణ సంస్థ అంచనాల ప్రకారం.. ప్రధానంగా ఆరు జిల్లాల్లో వర్ష ప్రభావం ఉండనుంది. పార్వతీపురం మన్యం, అనకాపల్లి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాల్లో మంగళవారం అక్కడక్కడా జల్లులు పడే అవకాశం ఉంది. వీటితో పాటు ఉత్తరాంధ్ర, రాయలసీమలోని ఇతర జిల్లాల్లోనూ కొన్నిచోట్ల చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు కురవవచ్చని అధికారులు పేర్కొన్నారు.ఈ క్రమంలో ప్రజలకు అధికారులు పలు సూచనలు జారీ చేశారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతున్నప్పుడు బహిరంగ ప్రదేశాల్లో ఉండవద్దని, సురక్షితమైన భవనాల్లో ఆశ్రయం పొందాలని హెచ్చరించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని, నీరు నిలిచిపోయే అవకాశం ఉన్నందున స్థానిక పరిస్థితులను నిరంతరం గమనిస్తూ ఉండాలని తెలిపారు. అన్ని జిల్లాల్లోనూ అధికారులు వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు.

నైపుణ్యాలే అభివృద్ధికి చోదకశక్తి

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాల పెంపులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు ప్రకటించిన పురస్కారాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్, ఏపీఎస్‌డీపీఎస్ ఈడీ వీఆర్ అలపర్తి స్వీకరించారు. ఈ విభాగంలో కర్ణాటక, ఒడిశా రాష్ట్రాలు వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచి అవార్డులను అందుకున్నాయి.శిక్షణ అంటే కేవలం ధ్రువపత్రాలు పొందడం మాత్రమే కాదని, నేర్చుకున్న నైపుణ్యాలు ప్రజలకు అందే సేవల నాణ్యతలో ప్రతిబింబించాలని సీఎం పేర్కొన్నారు. "ఒక రెవెన్యూ అధికారి సమస్యను వేగంగా పరిష్కరించడం, ఉపాధ్యాయుడు మెరుగ్గా బోధించడం వంటి సానుకూల మార్పులే శిక్షణకు అసలైన గీటురాయి" అని ఆయన వివరించారు. సాంకేతికత అందుబాటులోకి వచ్చినప్పటికీ, ఇంకా పాత నిబంధనలు, అనవసరమైన పేపర్‌వర్క్‌ను కొనసాగించడం సరికాదని, పాలనా ప్రక్రియలను సమూలంగా సంస్కరించాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.పాలనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి అత్యాధునిక సాంకేతికతలను విస్తృతంగా వినియోగించుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులు సోషల్ మీడియాలో సమయాన్ని వెచ్చించే బదులు, 'ఐగాట్-మిషన్ కర్మయోగి' వేదిక ద్వారా తమ వృత్తిపరమైన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రభుత్వం కేవలం నియంత్రణ వ్యవస్థగా కాకుండా, ప్రజలను సాధికారత దిశగా నడిపించేదిగా ఉండాలని, తద్వారా 2047 నాటికి వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సదస్సులో పలు దక్షిణాది రాష్ట్రాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భారత రైల్వేలో సరికొత్త ప్రయోగం..

మొదటి పేజీ తరువాయి

ఈ రైలు ఎనిమిది కోచ్‌లు కలిగిన డీజిల్ ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్ (డీఈఎంయూ) ర్యాక్. దీని ప్రత్యేకత డ్యూయల్-ఫ్యూయల్ సిస్టమ్‌తో పనిచేయడం. ఈ రైలుకు ఉన్న రెండు 1,400 హార్స్‌పవర్ సామర్థ్యం గల డ్రైవింగ్ పవర్ కార్లను (ఇంజిన్లు) డీజిల్‌తో పాటు ఎల్ఎన్‌జీతో కూడా నడిచేలా మార్పులు చేశారు. ఇంధన లభ్యత, అవసరాన్ని బట్టి డీజిల్ లేదా ఎల్ఎన్‌జీల మధ్య ఇంజిన్‌ను మార్చుకునే సౌలభ్యం దీనిలో ఉంది. ప్రతి పవర్ కారులో 2,200 లీటర్ల సామర్థ్యమున్న ప్రత్యేక ఇన్సులేటెడ్ ఎల్ఎన్‌జీ ట్యాంక్‌ను అమర్చారు. ఇది అత్యంత శీతల ఉష్ణోగ్రతల్లో ఇంధనాన్ని సురక్షితంగా నిల్వ చేస్తుంది.ఈ డ్యూయల్ ఫ్యూయల్ విధానం ద్వారా డీజిల్ వాడకాన్ని దాదాపు 40 శాతం వరకు తగ్గించవచ్చని రైల్వే అధికారులు అంచనా వేస్తున్నారు. ట్రయల్ రన్స్‌లో వెల్లడైన వివరాల ప్రకారం, ఒక్కో డ్రైవింగ్ పవర్ కారుకు ఏటా సుమారు రూ.11.9 లక్షల వరకు ఇంధన ఖర్చు ఆదా అయ్యే అవకాశం ఉంది. ఈ రైలును అధికారికంగా ప్రారంభించడానికి ముందు 2,000 కిలోమీటర్లకు పైగా క్షేత్రస్థాయిలో విజయవంతంగా పరీక్షించారు.అయితే, ఎల్ఎన్‌జీ కూడా శిలాజ ఇంధనమే కావడంతో ఇది పూర్తిస్థాయిలో కాలుష్యరహిత రైలు కాదు.

రాముడు-శివుడిపై సీఎం రేవంత్ రెడ్డి కామెంట్స్.. జాతీయ రాజకీయాల్లో దుమారం



- ఉత్తర, దక్షిణ భారతదేశంపై సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలతో వివాదం
- తాము ద్రావిడులమని, శివభక్తులమని.. ఉత్తరాది వారు ఆర్యులని, రామభక్తులని వ్యాఖ్య
- హిందువులను విడదీసేందుకే రేవంత్ మాట్లాడుతున్నారని బీజేపీ ఆరోపణ
- రాహుల్ గాంధీ ఆదేశాలతోనే రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారని బీజేపీ విమర్శ

హైదరాబాద్ (సామాన్యుడి అస్త్రం)

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు జాతీయ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. ఉత్తర, దక్షిణ భారతదేశ ప్రజల మధ్య మత, రాజకీయ పరమైన గుర్తింపులపై ఆయన చేసిన విశ్లేషణ పెద్ద వివాదానికి దారితీసింది. రాజకీయ లబ్ధి కోసం రేవంత్ రెడ్డి సమాజంలో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ తీవ్రంగా విమర్శించింది.

ఏం జరిగిందంటే..!

జాతీయ రాజధాని ఢిల్లీలో జరిగిన ఒక మీడియా కార్యక్రమంలో పాల్గొన్న రేవంత్ రెడ్డి, బీజేపీ నినాదాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ సహా బీజేపీ నేతలు పదే పదే 'జై శ్రీరామ్' అని ఎందుకు అంటారని, అదే తరహాలో 'హర హర మహాదేవ్' అని ఎందుకు నినదించరని ఆయన ప్రశ్నించారు."మేం ద్రావిడులం. ఇక్కడి (ఉత్తర భారతదేశం) ప్రజలు ఆర్యులు. మేం శివ భక్తులం, ఇక్కడి ప్రజలు శ్రీరాముడి భక్తులు. బీజేపీ రాముడిని దొంగిలించింది. అది ఒక భావోద్వేగం. మోదీ గారు 'హర హర మహాదేవ్' అని ఎందుకు అనరు? బీజేపీ నేతలు వేదికపై ఆ నినాదం చేయడం మీరు ఎప్పుడైనా చూశారా? వాళ్లు కేవలం 'జై శ్రీరామ్' అంటారు. మేం 'హర హర మహాదేవ్' అంటే వారికి నచ్చదు" అని రేవంత్ రెడ్డి అన్నారు. శివుడిని 'పేదల దేవుడు' అని, రాముడిని 'ధనవంతుల దేవుడు' అని అభివర్ణించిన ఆయన, ఇద్దరు దేవుళ్లను ప్రజలు ఆరాధిస్తారని కూడా స్పష్టం చేశారు. ఉత్తర, దక్షిణ భారతదేశ రాజకీయ సంస్కృతులు, సామాజిక గుర్తింపుల మధ్య విస్తృతమైన తేడాలు ఉన్నాయనే వాదనకు బలం చేకూర్చే క్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

తీవ్రంగా స్పందించిన బీజేపీ

రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆదేశాల మేరకే రేవంత్ రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించింది. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ మాట్లాడుతూ.. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే హిందువులను విభజించేందుకు రేవంత్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు."రాహుల్ గాంధీ సూచనల మేరకు, హిందువులను విభజించడానికి కొత్త మార్గం కనుగొనే ప్రయత్నంలో భాగంగానే రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు" అని ప్రదీప్ భండారీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కాంగ్రెస్ పార్టీని 'ఆధునిక ముస్లిం లీగ్ కాంగ్రెస్' అని అభివర్ణించిన ఆయన, రాముడు, శివుడి అనుచరుల మధ్య చిచ్చు పెట్టే కుట్రలు ఫలించవని హెచ్చరించారు.గతంలో కాంగ్రెస్ పార్టీ అనేక మతపరమైన, ఆలయ సంబంధిత కార్యక్రమాలను వ్యతిరేకించిందని ఆయన గుర్తుచేశారు. "సోమనాథ్ ఆలయ నిర్మాణాన్ని, కాశీ విశ్వనాథ్ ధామ్ కారిడార్‌ను కాంగ్రెస్ వ్యతిరేకించిన విషయం దేశం మరిచిపోలేదు. 2018లో 'హర హర మహాదేవ్' అని నినదించినందుకు ముగ్గురు పార్టీ కార్యకర్తలను సస్పెండ్ చేసింది" అని భండారీ ఆరోపించారు.బీజేపీ నేతలు 'హర హర మహాదేవ్' అని నినదించరన్న రేవంత్ వాదనను ఆయన తోసిపుచ్చారు. "ప్రధాని మోదీ 'జై శ్రీరామ్'తో పాటు 'హర హర మహాదేవ్' అని కూడా నినదించే ఏకైక ప్రధానమంత్రి. లంకకు వెళ్లే ముందు శ్రీరాముడు స్వయంగా మహాదేవుడికి పూజలు చేశాడని రామాయణంలోని లంకాకాండలో ఉంది. ఓటు బ్యాంకు రాజకీయాలు చేసేవారికి ఈ విషయం కూడా తెలియదు" అని ఆయన ఎద్దేవా చేశారు. మొత్తంగా రేవంత్ వ్యాఖ్యలు బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధానికి దారితీశాయి.

డాక్టర్ భాస్కర్ కేసు..

- డాక్టర్ భాస్కర్ అక్రమాస్తుల కేసులో వేగవంతమైన దర్యాప్తు
- నిమ్స్‌లోని ఇతర ఉద్యోగుల నివాసాల్లో ఏసీబీ అధికారుల సోదాలు
- తాజా తనిఖీల్లో రూ.7 లక్షల నగదు స్వాధీనం


హైదరాబాద్ (సామాన్యుడి అస్త్రం)

హైదరాబాద్‌లోని నిమ్స్ (నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) ఆసుపత్రి అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నూరి లక్ష్మీ భాస్కర్ అక్రమాస్తుల కేసులో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ కేసు విచారణలో భాగంగా ఈ ఉదయం నిమ్స్‌లోని పలువురు ఉద్యోగుల ఇళ్లలో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఇప్పటివరకు రూ.7 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఇటీవల అరెస్ట్ అయిన డాక్టర్ భాస్కర్‌కు కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో, ఆయన్ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. గతంలో ఆయన నివాసంతో పాటు బంధువులు, బినామీల ఇళ్లలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేశారు.

అద్దెకు తీసుకున్న కార్లు తాకట్టు?.. మసీద్‌బండలో యజమానుల ఆందోళన








- స్విఫ్ట్, బలెనో, ఎర్టిగా కార్లను తీసుకెళ్లినట్లు ఆరోపణలు
- నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లో తాకట్టు పెట్టినట్లు అనుమానాలు
- వాహనాల ఆచూకీ తేల్చాలని యజమానుల డిమాండ్

సామాన్యుడి అస్త్రం / శేరిలింగంపల్లి :

అద్దెకు తీసుకున్న కారు తిరిగి వస్తుందని ఎదురుచూస్తే, అది మరోచోట తాకట్టులో ఉందన్న సమాచారం అందుతోంది. మసీద్‌బండ ప్రాంతం నుంచి అద్దెకు తీసుకెళ్లిన స్విఫ్ట్, బలెనో, ఎర్టిగా కార్ల విషయంలో ఇలాంటి ఆరోపణలు వినిపిస్తుండటంతో వాహన యజమానులు ఆందోళన చెందుతున్నారు.కొంతమంది యువకులు కార్లను అద్దెకు తీసుకుని, యజమానులకు తెలియకుండా ఇతరుల వద్ద తాకట్టు పెట్టి నగదు పొందుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. కొన్ని వాహనాలను నిజామాబాద్, మహబూబ్‌నగర్ ప్రాంతాలకు తీసుకెళ్లినట్లు చెబుతున్నారు. అయితే ఏ కారు ఎక్కడ ఉంది, ఎవరి వద్ద తాకట్టులో ఉంది అన్న విషయాలపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది.కారు తిరిగి ఇవ్వాల్సిన సమయానికి అద్దెకు తీసుకెళ్లిన వారు అందుబాటులో లేకపోవడం, ఫోన్లు స్విచ్ఛాఫ్ కావడం తమ ఆందోళనను పెంచుతోందని యజమానులు అంటున్నారు. వాహనాల ఆచూకీని గుర్తించడంతో పాటు, అద్దె ఒప్పందాలు, నగదు లావాదేవీలు, కార్లను స్వీకరించిన వారి పాత్రను పోలీసులు పరిశీలించాలని కోరుతున్నారు. ఆరోపణల్లో నిజమెంతన్నది దర్యాప్తులో తేలాల్సి ఉంది.



అంబేడ్కర్ పాఠ్యాల వివరాలెందుకు? కేంద్రాన్ని నిలదీసిన బీఎస్ఎఫ్

- రచనలు బోధించే కోర్సులు, విద్యార్థుల సంఖ్య కోరడంపై అభ్యంతరం
- సామాజిక మాధ్యమ పోస్టు ఆధారంగా విద్యా నిర్ణయాలు వద్దని డిమాండ్
- పాఠ్యాంశాలపై విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని గౌరవించాలని వినతి

సామాన్యుడి అస్త్రం / శేరిలింగంపల్లి :


అంబేడ్కర్, ఫూలే, పెరియార్ తదితర ఆలోచనాపరుల రచనలు బోధిస్తున్న కోర్సుల వివరాలను కేంద్ర విశ్వవిద్యాలయాల నుంచి కోరడంపై హైదరాబాద్ విశ్వవిద్యాలయం బహుజన్ స్టూడెంట్స్ ఫ్రంట్ (బీఎస్ఎఫ్--హెచ్‌సీయూ) అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ కోర్సుల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్యను కూడా ఎందుకు సేకరిస్తున్నారో కేంద్ర ఉన్నత విద్యాశాఖ స్పష్టం చేయాలని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో డిమాండ్ చేసింది.ఆ రచనలను 'విషం'గా పేర్కొంటూ సామాజిక మాధ్యమంలో అనామక ఖాతా చేసిన పోస్టు తర్వాతే ఈ వివరాలు కోరినట్లు బీఎస్ఎఫ్ పేర్కొంది. ఒక పోస్టులో వచ్చిన ఆరోపణల ఆధారంగా పాఠ్యాంశాలను సమీక్షించడం ఆందోళన కలిగిస్తోందని తెలిపింది. కోర్సుల్లో ఏ రచనలు ఉండాలనే నిర్ణయం అధ్యాపకులు, సంబంధిత విభాగాలు, బోర్డ్ ఆఫ్ స్టడీస్, అకడమిక్ కౌన్సిళ్ల చర్చల ద్వారా జరగాలని స్పష్టం చేసింది.అంబేడ్కర్, జ్యోతిరావు ఫూలే, సావిత్రిబాయి ఫూలే, పెరియార్‌తో పాటు గెయిల్ ఓంవెట్, కంచ ఐలయ్య షెపర్డ్, షర్మిలా రేగే రచనలు కులం, లింగ వివక్ష, సామాజిక అసమానతలను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయని బీఎస్ఎఫ్ పేర్కొంది. వాటిని చదవడమంటే విద్యార్థులపై ఒక అభిప్రాయాన్ని రుద్దడం కాదని, చదివిన విషయాన్ని ప్రశ్నించి సొంత నిర్ణయానికి వచ్చే అవకాశం కల్పించడమని వివరించింది.



విద్యార్థుల సంఖ్య ఎందుకు?

ఒక అంశాన్ని చదువుతున్న విద్యార్థుల సంఖ్యను ప్రత్యేకంగా సేకరించాల్సిన విద్యాపరమైన కారణమేమిటో వెల్లడించాలని బీఎస్ఎఫ్ కోరింది. తాము చదివే పుస్తకాలు, కోర్సుల కారణంగా గుర్తింపునకు గురవుతున్నామనే భావన విద్యార్థుల్లో ఏర్పడకూడదని తెలిపింది. కుల వ్యతిరేక, దళిత, ఆదివాసీ, బహుజన, స్త్రీవాద అధ్యయనాల్లో అనవసర జోక్యాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేసింది. కోర్సుల సమీక్షకు అనుసరించే విధివిధానాలను బహిర్గతం చేసి, పాఠ్యాంశాల నిర్ణయంలో విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని గౌరవించాలని కోరింది. "తరగతి గది భయపడే ప్రదేశం కాదు.. ప్రశ్నించే ప్రదేశం" అని ప్రకటనలో పేర్కొంది.

అక్రమ కట్టడాలపై సీఎంసీ కొరడా.. ఒక్కరోజే 15 కూల్చివేతలు



- కుత్బుల్లాపూర్‌లో అత్యధికంగా ఆరు నిర్మాణాల తొలగింపు
- శేరిలింగంపల్లిలో ఐదు, కూకట్‌పల్లిలో నాలుగు కూల్చివేతలు
- మరో రెండు నోటీసులు జారీ చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు

సామాన్యుడి అస్త్రం / శేరిలింగంపల్లి :

అనధికార నిర్మాణాలపై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను ముమ్మరం చేసింది. మంగళవారం మూడు జోన్లలో క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టిన బృందాలు 15 అనధికార నిర్మాణాలను గుర్తించాయి. అదే రోజు 15 కూల్చివేతలు చేపట్టి, రెండు నోటీసులు జారీ చేసినట్లు సీఎంసీ ప్రకటించింది.కూల్చివేతల్లో కుత్బుల్లాపూర్ జోన్‌లో ఆరు, శేరిలింగంపల్లిలో ఐదు, కూకట్‌పల్లిలో నాలుగు నమోదయ్యాయి. భవన నిర్మాణ నిబంధనల అమలును పరిశీలిస్తూ మూడు జోన్లలోనూ తనిఖీలు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గుర్తించిన ప్రతి కేసులో నిర్దేశిత విధానం ప్రకారం తదుపరి చర్యలు చేపడతామని పేర్కొన్నారు.అనధికార నిర్మాణాన్ని గుర్తించడంతోనే పని ముగిసినట్లు భావించవద్దని, ప్రతి కేసును నిరంతరం పర్యవేక్షించి సకాలంలో చర్యలు తీసుకోవాలని సీఎంసీ కమిషనర్ సంబంధిత బృందాలను ఆదేశించారు. జోన్ల మధ్య సమన్వయంతో తనిఖీలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ కొనసాగుతాయని కార్పొరేషన్ వెల్లడించింది.



బెంగళూరులో ఆటో ఛార్జీ రగడ.. యువతులతో డ్రైవర్ ఫైట్

ఆటో ఛార్జీ విషయమై ఇద్దరు యువతులు, డ్రైవర్ మధ్య ఘర్షణ
యువతి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు, డ్రైవర్ అరెస్ట్
యువతులే మద్యం తాగి ముందు దాడి చేశారని డ్రైవర్ ఆరోపణ

నగరంలో ఆటో ఛార్జీ విషయమై ఇద్దరు యువతులు, ఒక ఆటో డ్రైవర్ మధ్య జరిగిన వాగ్వివాదం తీవ్ర ఘర్షణకు దారితీసింది. నడిరోడ్డుపై జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు స్పందించి, ఆటో డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు.సోమవారం మధ్యాహ్నం బెంగళూరులోని హెచ్ఎస్ఆర్ లేఅవుట్ 3వ సెక్టార్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. వైరల్ అవుతున్న వీడియోలో ఇద్దరు



యువతులు, ఆటో డ్రైవర్ ఒకరినొకరు నెట్టుకుంటూ, కొట్టుకుంటూ కనిపించారు. మాటామాటా పెరిగి పరిస్థితి తీవ్రరూపం దాల్చడంతో, అక్కడే ఉన్న మరో మహిళ జోక్యం చేసుకుని వారిని విడదీసే ప్రయత్నం చేసింది. ఈ దృశ్యాలను కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది క్షణాల్లో వైరల్ అయింది.సోషల్ మీడియాలో వీడియో వైరల్ అవడంతో హెచ్ఎస్ఆర్ లేఅవుట్ పోలీసులు ఈ ఘటనపై దృష్టి సారించారు. వారు యువతులను సంప్రదించి ఫిర్యాదు చేయాల్సిందిగా కోరారు. మంగళవారం ఓ యువతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో, పోలీసులు డ్రైవర్ చేతన్ కుమార్‌ను (33) అదుపులోకి తీసుకున్నారు. మహిళల గౌరవానికి భంగం కలిగించే ఉద్దేశంతో దాడి చేశారన్న సెక్షన్ కింద కేసు నమోదు చేశారు.పోలీసుల విచారణ ప్రకారం.. కోరమంగళలోని ఓ సెలూన్‌లో పనిచేసే ఈ యువతులు యాప్ ద్వారా ఆటో బుక్ చేశారు. పలుమార్లు బుకింగ్ క్యాన్సిల్ చేయడం, ఆటో ఛార్జీ విషయంలోనే గొడవ మొదలైనట్లు తెలుస్తోంది. అయితే, యువతులు మద్యం మత్తులో ఉన్నారని, ఛార్జీ చెల్లించకుండా తనను దూషిస్తూ ముందు వారే దాడి చేశారని, తాను కేవలం ప్రతిఘటించానని డ్రైవర్ పోలీసులకు చెప్పాడు. ఈ ఆరోపణలపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

తుమ్మిడిహట్టి బ్యారేజీ అనుమతులకు చొరవ తీసుకోండి

- **కేంద్ర జల్‌శక్తి మంత్రిని కలిసిన ముఖ్యమంత్రి**
- **తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులపై విస్తృత చర్చ**
- **కృష్ణా, గోదావరి బేసిన్ అంశాల ప్రస్తావన**

హైదరాబాద్ (సామాన్యుడి అస్త్రం)

తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు త్వరగా లభించేలా కేంద్రం చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర జల్‌శక్తి మంత్రి సి.ఆర్. పాటిల్‌ను కోరారు. ఢిల్లీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రిని కలిసిన ముఖ్యమంత్రి, తెలంగాణకు సంబంధించిన కీలక నీటిపారుదల ప్రాజెక్టుల అంశాలను వివరించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే అందించినట్లు తెలిపారు.తుమ్మిడిహట్టి బ్యారేజీని పూర్తి జలమట్టం 152 మీటర్ల స్థాయిలో నిర్మించేందుకు తెలంగాణ, మహారాష్ట్ర మధ్య త్వరగా అవగాహన కుదిరేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఆ స్థాయిలో బ్యారేజీ నిర్మాణం జరిగితే గ్రావిటీ విధానంలో నీటిని ఎల్లంపల్లికి తరలించే అవకాశం ఉంటుందని వివరించారు. దీనివల్ల విద్యుత్ వినియోగం, నిర్వహణ వ్యయం గణనీయంగా తగ్గుతుందని పేర్కొన్నారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ఎత్తిపోతల పథకం, సీతారామ సాగర్ బహుళార్థక ప్రాజెక్టు, గౌరవెల్లి రిజర్వాయర్‌కు పెండింగ్‌లో ఉన్న పర్యావరణ అనుమతులను త్వరగా మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రిని కోరారు. అనుమతుల జాప్యం వల్ల ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం పెరుగుతోందని, అభివృద్ధి పనులు ఆలస్యమవుతున్నాయని వివరించారు.సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘం వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులను కూడా త్వరితగతిన



మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు సమగ్ర నివేదికను ఇప్పటికే సమర్పించినట్లు పేర్కొంటూ, నీటిపారుదల ప్రణాళికలకు సంబంధించిన అంతర్రాష్ట్ర అనుమతులను త్వరగా మంజూరు చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిరభ్యంతర పత్రం కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో చర్చలు కొనసాగుతున్నట్లు తెలిపారు.కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాల్సిన టెలీమెట్రీ వ్యవస్థలను వేగవంతం చేయాలని కూడా ముఖ్యమంత్రి కోరారు. తొలి దశ టెలీమెట్రీ పరికరాల ఏర్పాటుకు అవసరమైన నిధులను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే జమ చేసిన విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రెండో, మూడో దశల పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ కాకా వంశీ గడ్డం, రాష్ట్ర ప్రభుత్వ నీటిపారుదల సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు. తెలంగాణలో సాగునీటి వనరుల విస్తరణ, ప్రాజెక్టుల పూర్తి కోసం కేంద్రం సానుకూల సహకారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది.

సాగునీటి ప్రాజెక్టులకు ఆర్మీ ఇంజినీర్లు

- **ఎస్ఎల్‌బీసీ, కాళేశ్వరం పనుల పర్యవేక్షణకు ముగ్గురు అధికారుల డిప్యుటేషన్**
- **వేగం, నాణ్యత, భద్రతకు అధిక ప్రాధాన్యం**
- **నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

హైదరాబాద్ (సామాన్యుడి అస్త్రం)

'రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో వేగం, నాణ్యత, భద్రతను మరింత పెంచేందుకు ఆర్మీ ఇంజినీరింగ్ అధికారుల సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగ నిర్మాణంతోపాటు కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనుల పర్యవేక్షణకు ముగ్గురు ఆర్మీ అధికారులను డిప్యుటేషన్‌పై తెలంగాణకు తీసుకురావాలని కసరత్తు చేస్తున్నది' అని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ముగ్గురు అధికారుల్లో ఒకరిని ఎస్ఎల్‌బీసీ సొరంగ నిర్మాణ పనుల పర్యవేక్షణకు, మరో ఇద్దరిని కాళేశ్వరం బ్యారేజీల మరమ్మతులు, పునరుద్ధరణ పనుల పర్యవేక్షణకు వినియోగించాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు.



ఇందుకోసం కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్మీ ప్రధాన కార్యాలయానికి లెఫ్టినెంట్ కల్నల్ సత్యదేవ్‌సింగ్, లెఫ్టినెంట్ కల్నల్ రంజిత్ ఏ.మీనన్, లెఫ్టినెంట్ కల్నల్ హెచ్.వి.భల్లా పేర్లను పంపినట్లు వెల్లడించారు.

ఆర్మీ చీఫ్‌తో చర్చల అనంతరం..

ఎస్ఎల్‌బీసీ సొరంగ నిర్మాణంలో ఎదురవుతున్న సాంకేతిక సవాళ్లు, కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ అవసరంపై ఇటీవల న్యూఢిల్లీలో ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేథ్‌తో చర్చించినట్లు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అనుభవజ్ఞులైన ఆర్మీ ఇంజినీరింగ్ అధికారులను డిప్యుటేషన్‌పై తెలంగాణకు పంపాలని కోరగా.. ఆర్మీ ప్రధాన కార్యాలయం సానుకూలంగా స్పందించి ముగ్గురి పేర్లను పంపినట్లు చెప్పారు.అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లోనూ కచ్చితత్వంతో పనిచేయడం ఆర్మీ అధికారుల ప్రత్యేకత అని పేర్కొన్నారు. సాంకేతిక నైపుణ్యంతోపాటు క్రమశిక్షణ, నాయకత్వం, జవాబుదారీతనం, వేగంగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం వారికి ఉంటాయని చెప్పారు. ఇలాంటి అనుభవాన్ని రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టులకు వినియోగించుకోవాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వంలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న కల్నల్ పరీక్షిత్ మెహ్రా సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. ఎస్ఎల్‌బీసీతోపాటు కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ ప్రణాళికలు, క్షేత్రస్థాయి పర్యవేక్షణలో ఆయన కీలకంగా పనిచేస్తున్నారని చెప్పారు. సుమారు 44 కిలోమీటర్ల పొడవైన ఎస్ఎల్‌బీసీ సొరంగ నిర్మాణంలో ఇప్పటికే దాదాపు 35 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పనులను 2028 జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. కొత్తగా నియమించే ఆర్మీ అధికారి సొరంగం ఇరువైపులా జరుగుతున్న తవ్వకాలు, లోపలి పనులు, వెంటిలేషన్, భద్రతా ఏర్పాట్లు, క్షేత్రస్థాయి సమన్వయాన్ని పర్యవేక్షిస్తారని తెలిపారు.

శాస్త్రీయ పద్ధతిలో కాళేశ్వరం పునరుద్ధరణ

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పూర్తి భద్రతతో తిరిగి వినియోగంలోకి తీసుకురావడానికి శాస్త్రీయ పద్ధతిలో చర్యలు చేపడుతున్నట్లు మంత్రి ఉత్తమ్ తెలిపారు.

బొల్లారం ఆయుధాల చోరీ కేసులో కీలక పరిణామం.. మల్లేశ్‌కు సహకరించింది వారే..!





మల్లేశ్‌కు గోడౌన్ కీపర్లు సహకరించినట్లు విచారణలో వెల్లడి
వినోద్, శేషులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
మల్లేశ్‌తో భారీ ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు గుర్తింపు
మల్లేశ్ ఇంట్లో ఆయుధాలు, బుల్లెట్ల స్వాధీనం
సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ కోసం రెజిమెంట్‌కు మల్లేశ్ తరలింపు

హైదరాబాద్ (సామాన్యుడి అస్త్రం)

బొల్లారం మద్రాస్ రెజిమెంట్ ఆయుధాల చోరీ కేసు దర్యాప్తులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ హవల్దార్ మల్లేశ్‌కు ఆయుధాగారం ఇన్‌చార్జ్‌లు సహకరించినట్లు విచారణలో తేలింది. దీంతో వెపన్స్ గోడౌన్ కీపర్లు వినోద్, శేషులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.వినోద్, శేషులు ఆయుధాల చోరీలో మల్లేశ్‌కు సహకరించినట్లు పోలీసులు ఆధారాలు గుర్తించారు. మల్లేశ్‌తో వారికి భారీగా ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు సాంకేతిక ఆధారాల ద్వారా నిర్ధారణకు వచ్చారు. దీంతో ఈ కేసు దర్యాప్తును పోలీసులు మరింత వేగవంతం చేశారు.మల్లేశ్ నివాసంలో ఇప్పటికే పోలీసులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పలు కీలకమైన ఆర్మీ ఆయుధాలు, బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం మల్లేశ్‌ను 10 రోజుల పోలీసు కస్టడీలో విచారిస్తున్నారు.దర్యాప్తులో భాగంగా సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ కోసం మల్లేశ్‌ను నేరుగా మద్రాస్ రెజిమెంట్‌కు తీసుకెళ్లారు. ఈ కేసులో మరిన్ని వివరాలను పోలీసులు త్వరలో వెల్లడించే అవకాశం ఉంది.

మహిళా ఎమ్మెల్యేలతో దురుసు ప్రవర్తన

- **దురుసుగా ప్రవర్తించిన పోలీసులను గుర్తించాలని డీజీపీకి హైకోర్టు ఆదేశం**
- **సంబంధిత పోలీసుల వివరాలను స్పీకర్‌కు సమర్పించాలని సూచన**
- **వారిపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉందని వ్యాఖ్యానించిన కోర్టు**
- **సెప్టెంబర్ 7న అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనపై బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ**

హైదరాబాద్ (సామాన్యుడి అస్త్రం)


తెలంగాణ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా ప్రవర్తించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని రాష్ట్ర డీజీపీని హైకోర్టు ఆదేశించింది. మంగళవారం ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆ అధికారుల వివరాలను సేకరించి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సమర్పించాలని డీజీపీ సీవీ ఆనంద్‌కు సూచించింది.సెప్టెంబర్ 7న అసెంబ్లీ వర్షాకాల సమావేశాల మొదటి రోజున ఈ ఘటన చోటుచేసుకుంది. నల్ల టీ-షర్టులు ధరించి నిరసన తెలిపేందుకు వెళుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, ఎమ్మెల్యేలకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. ఈ ఘటనలో తమ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అమర్యాదగా ప్రవర్తించారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, బాధ్యులైన అధికారులపై అసెంబ్లీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉంటుందని స్పష్టం చేసింది. ఒక మహిళా ఎమ్మెల్యే చీర లాగారని, మాజీ హోంమంత్రిగా పనిచేసిన మరో మహిళా ఎమ్మెల్యేను మెడ పట్టుకుని నెట్టారని బీఆర్ఎస్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.శాసనసభ్యులను అసెంబ్లీలోకి వెళ్లకుండా నిలువరించే హక్కు పోలీసులకు లేదని, నిబంధనల ఉల్లంఘన జరిగితే చర్యలు తీసుకోవాల్సింది స్పీకర్ మాత్రమేనని సెప్టెంబర్ 8నే హైకోర్టు తేల్చి చెప్పిన విషయం విదితమే. మరోవైపు, ఈ ఘటనకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు ఎమ్మెల్యేలపై కేసులు నమోదయ్యాయి. అయితే, తాము ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసులు నమోదు చేయలేదని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ ఇప్పటికే జాతీయ మహిళా కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్‌తో పాటు గవర్నర్‌కు కూడా ఫిర్యాదు చేసింది.



ఇక్కడున్నది మోదీ-చంద్రబాబు-పవన్ అని గుర్తుంచుకోవాలి:

సీఎం చంద్రబాబు మాస్ వార్నింగ్

మోదీ సహకారం, పవన్ హుషారుతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామన్న చంద్రబాబు
గత ప్రభుత్వ హయాంలో 880 కి.మీ. సీసీ రోడ్లు వేశారన్న చంద్రబాబు
మేం రెండేళ్లలో 6,500 కి.మీ. వేశామని వెల్లడి
అభివృద్ధికి అడ్డుపడితే ఎంతమాత్రం సహించబోమని హెచ్చరిక
స్థానిక ఎన్నికల్లోనూ కూటమిదే విజయం ఖాయమన్న చంద్రబాబు



అమరావతి (సామాన్యుడి అస్త్రం)

కూటమి ప్రభుత్వం పేదలకు పట్టాభిషేకం చేస్తుంటే, మరికొందరు విధ్వంసంతో రక్తాభిషేకం చేస్తామంటున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే సహించే ప్రసక్తి లేదని, ఇక్కడ ఉన్నది మోదీ, చంద్రబాబు, పవన్ అని గుర్తుంచుకోవాలని ఆయన ఈ సందర్భంగా ప్రత్యర్థులను హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలోని విధ్వంసానికి, నేటి కూటమి ప్రభుత్వ వికాసానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని ఆయన కోరారు. ఉదయగిరి నియోజకవర్గంలో నిర్వహించిన 'పల్లె పండుగ-3.0' బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగించారు.ప్రధాని నరేంద్ర మోదీ సహకారం, తన అనుభవం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ హుషారుతో రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. 2024 ఎన్నికల్లో ప్రజలు కూటమికి చారిత్రక విజయాన్ని అందించారని, ప్రస్తుతం ఆ ప్రజాదరణ మరింత పెరిగిందని ఆయన పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమిదే ఘనవిజయమని ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పల్లెలు నిర్లక్ష్యానికి గురయ్యాయని, కనీస సౌకర్యాల కల్పనకు కూడా నిధులు లేని దుస్థితి నెలకొందని విమర్శించారు.గత ఐదేళ్లలో కేవలం 880 కిలోమీటర్ల సీసీ రోడ్లు మాత్రమే నిర్మిస్తే, తమ ప్రభుత్వం కేవలం రెండేళ్ల వ్యవధిలోనే 6,500 కిలోమీటర్ల రోడ్లను నిర్మించిందని చంద్రబాబు వివరించారు. రాష్ట్రంపై రూ.10 లక్షల కోట్ల అప్పుల భారం, ఖాళీ ఖజానా ఉన్నప్పటికీ, 'సూపర్ సిక్స్' వంటి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు రెండో దశను పూర్తి చేసి ఉదయగిరి నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు.

కొచ్చిలో నారా లోకేశ్ కు ఆత్మీయ స్వాగతం పలికిన తెలుగు ప్రజలు



సౌత్ ఇండియా సదస్సు కోసం కేరళలోని కొచ్చికి మంత్రి లోకేశ్
ఏపీ ప్రగతి పథంపై సదస్సులో కీలక ప్రసంగం చేయనున్న లోకేశ్
పాలన, విద్య, ఉపాధి అవకాశాలపై చర్చించనున్నట్లు వెల్లడి
కొచ్చిలో తెలుగు ప్రజల నుంచి ఘనస్వాగతం లభించిందన్న మంత్రి

రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం

అమరావతి (సామాన్యుడి అస్త్రం)

ఆంధ్రప్రదేశ్ ఐటీ, మానవ వనరుల అభివృద్ధి, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్ల శాఖ మంత్రి నారా లోకేశ్ కేరళలోని కొచ్చి చేరుకున్నారు. కొచ్చి వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక 'ఇండియా టుడే సౌత్ ఇండియా సమ్మిట్'లో పాల్గొనేందుకు ఆయన అక్కడికి వచ్చారు. ఈ సదస్సులో ఆయన ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ప్రగతి ప్రస్థానంపై కీలక ప్రసంగం చేయనున్నారు."ఆంధ్రప్రదేశ్ ప్రగతి ప్రస్థానం -- పాలన, అభివృద్ధి, విద్య, ప్రపంచ స్థాయి లక్ష్యాలు" అనే అంశంపై మంత్రి లోకేశ్ ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సుపరిపాలన, ఆర్థికాభివృద్ధి, విద్యా రంగంలో చేపడుతున్న సంస్కరణలు, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, విదేశీ పెట్టుబడుల ఆకర్షణ వంటి కీలక అంశాలను ఆయన వివరించనున్నారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను కూడా ఆయన ఈ వేదికపై ప్రస్తావించనున్నట్లు తెలుస్తోంది.తన పర్యటనపై మంత్రి లోకేశ్ సోషల్ మీడియా ద్వారా స్పందించారు. "కొచ్చిలో అడుగుపెట్టిన నాకు తెలుగు ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. ఇండియా టుడే సౌత్ కాన్‌క్లేవ్‌లో పాల్గొంటుండడం సంతోషంగా ఉంది. దక్షిణాదిలో అవకాశాలను తీర్చిదిద్దడంపై జరిగే ఈ చర్చలో పాల్గొనేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. కాగా, కొచ్చిలో లోకేశ్ కు స్వాగతం పలికిన వారిలో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు నిఖిల్ కూడా ఉన్నారు.దక్షిణాది రాష్ట్రాలకు చెందిన రాజకీయ, పారిశ్రామిక, విద్యా రంగ నిపుణులు ఈ సదస్సుకు హాజరవుతున్న నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ విధానాలను, అభివృద్ధి నమూనాను జాతీయ స్థాయిలో ప్రదర్శించేందుకు ఇది ఒక ముఖ్యమైన వేదికగా నిలుస్తుంది. ఈ సదస్సులో మంత్రి లోకేశ్ ప్రసంగంపై రాష్ట్రంలోని రాజకీయ, పారిశ్రామిక వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం..
రైతు బజార్లలో కిలో ఉల్లి రూ. 35కే

ఉల్లి ధరల నియంత్రణపై ప్రభుత్వం దృష్టి
రైతు బజార్లలో కిలో ఉల్లి రూ. 35కే విక్రయం
మొదటి దశలో విజయవాడలో రేపటి నుంచి అమ్మకాలు
కుటుంబానికి నెలకు 2 కిలోల చొప్పున పంపిణీ

అమరావతి (సామాన్యుడి అస్త్రం)

సామాన్యులకు ఊరటనిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న ఉల్లి ధరల నుంచి ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు రైతు బజార్లలో కిలో ఉల్లిపాయలను రూ. 35కే సబ్సిడీ ధరతో విక్రయించనున్నారు. తొలిదశలో భాగంగా రేపటి (సెప్టెంబర్ 30) నుంచి విజయవాడలోని అన్ని రైతు బజార్లలో ఈ విక్రయాలు ప్రారంభం కానున్నాయి.ఈ విక్రయాల కోసం ఆధార్ లేదా రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోనున్నారు. దీని ద్వారా ప్రతి కుటుంబానికి నెలకు 2 కిలోల వరకు సబ్సిడీ ఉల్లిపాయలు అందజేస్తారు. సామాన్యులపై పెరుగుతున్న ఉల్లి ధరల భారాన్ని తగ్గించాలనే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు



కోరారు.విజయవాడలో లభించే స్పందన, డిమాండ్‌ను బట్టి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రైతు బజార్లకు ఈ పథకాన్ని విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. మార్కెట్‌లో ఉల్లి ధరలు అదుపులోకి వచ్చే వరకు ఈ సబ్సిడీ విక్రయాలను కొనసాగించాలని అధికారులు యోచిస్తున్నారు.

పవన్ కల్యాణ్‌పై చంద్రబాబు ప్రశంసల వర్షం



ఉద్యమ స్ఫూర్తితో గ్రామాలను అభివృద్ధి చేస్తున్న పవన్‌కు సీఎం అభినందనలు
గత ప్రభుత్వం ఐదేళ్లలో 880 కి.మీ. సీసీ రోడ్లు వేస్తే, కూటమి రెండేళ్లలో 6500 కి.మీ. వేసింది
పంచాయతీరాజ్ శాఖలో 10 వేల మందికి పదోన్నతులు కల్పించామని వెల్లడి
కూటమి ప్రభుత్వంపై ప్రజల నమ్మకం పెరిగిందని, పంచాయతీ ఎన్నికల్లో గెలుపు ఖాయమని ధీమా

అమరావతి (సామాన్యుడి అస్త్రం)

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వ పటిమపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసల వర్షం కురిపించారు. పల్లె పండుగ-3.0 కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన ఆయన, పవన్ కల్యాణ్ ఒక ఉద్యమ స్ఫూర్తితో గ్రామాలను అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. ఆయన నాయకత్వంలో పంచాయతీరాజ్ శాఖ పల్లెల ప్రగతిలో తనదైన ముద్ర వేసిందని పేర్కొంటూ, ఈ సందర్భంగా పవన్ కల్యాణ్‌కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారుఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారథ్యంలో మూడు పల్లె పండుగలను అత్యంత విజయవంతంగా నిర్వహించుకున్నాం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో రాష్ట్రాన్ని నిలబెడుతున్నాం. 2024 ఎన్నికల్లో ప్రజలు వేసిన ఓటు వృధా కాలేదని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం" అని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పల్లెలు తీవ్ర విధ్వంసానికి గురయ్యాయని, కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లేలేని దుస్థితి నుంచి నేడు పవన్ కల్యాణ్ గ్రామాలను అభివృద్ధి బాట పట్టించారని వివరించారు.కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను ఈ సందర్భంగా ఆయన ఏకరువు పెట్టారు. సుమారు రెండున్నర దశాబ్దాల విరామం తర్వాత పంచాయతీరాజ్ శాఖలో 10 వేల మందికి పదోన్నతులు కల్పించామని, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 4,136 కోట్లు విడుదల చేశామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 880 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మిస్తే, తమ ప్రభుత్వం అతి తక్కువ కాలంలోనే 6,500 కిలోమీటర్ల రోడ్లు వేసి చరిత్ర సృష్టించిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ప్రజాధనం దొంగల జేబుల్లోకి వెళ్లగా, నేడు అభివృద్ధి పనులు ప్రజల కళ్లకు కనిపిస్తున్నాయని విమర్శించారు. ఇదే ఉత్సాహంతో రాబోయే పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమిని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

తిరుపతి ఎయిర్‌పోర్ట్ ప్రైవేటీకరణకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

11 విమానాశ్రయాల ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం
తమిళనాడులోని తిరుచ్చితో తిరుపతి ఎయిర్‌పోర్ట్ బండ్లింగ్
పీపీపీ పద్ధతిలో ప్రైవేటుకు నిర్వహణ బాధ్యతలు

అమరావతి (సామాన్యుడి అస్త్రం)

దేశంలోని 11 విమానాశ్రయాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి విమానాశ్రయాన్ని తమిళనాడులోని తిరుచ్చి అంతర్జాతీయ విమానాశ్రయంతో కలిపి (బండ్లింగ్) ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ (ఱుశీ×) జారీ చేసింది. పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో ఈ విమానాశ్రయాల నిర్వహణ, అభివృద్ధి, ఆధునికీకరణ బాధ్యతలను ప్రైవేటు సంస్థలు చూసుకుంటాయి.ఈసారి కేంద్రం తొలిసారిగా బండ్లింగ్ విధానాన్ని అనుసరిస్తోంది. వాణిజ్యపరంగా లాభదాయకతను పెంచేందుకు, తక్కువ రద్దీ ఉన్న విమానాశ్రయాన్ని, రద్దీగా ఉండే విమానాశ్రయంతో జత చేస్తున్నారు. ఈ 11 విమానాశ్రయాల అభివృద్ధికి ప్రైవేటు సంస్థల నుంచి సుమారు రూ. 8,622 కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నారు. విమానాశ్రయాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడం, నాన్-ఏరోనాటికల్ ఆదాయాన్ని (రిటైల్, కార్గో) పెంచడం దీని ముఖ్య ఉద్దేశం.తిరుమల యాత్రికులు, పర్యాటకుల రాకపోకలతో తిరుపతి విమానాశ్రయంలో ప్రయాణికుల రద్దీ గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం ఇక్కడి నుంచి హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ, ముంబై వంటి నగరాలకు రోజువారీ విమాన సర్వీసులు నడుస్తున్నాయి. భవిష్యత్తులో ప్రయాణికుల సంఖ్య పెరిగాక రాజమండ్రి, కడప విమానాశ్రయాలను కూడా ఇదే తరహాలో ప్రైవేటీకరించే అవకాశాలను పరిశీలిస్తున్నారు.లీజు ఒప్పందంలో భాగంగా, ప్రైవేటు సంస్థలు మొదటి మూడేళ్లపాటు ఎయిర్‌పోర్ట్ అథారిటీ సిబ్బందిలో 60 శాతం మందిని కొనసాగించాల్సి ఉంటుంది. విమానాశ్రయాల యాజమాన్యం ూూూ× వద్దే ఉండగా, నిర్వహణ బాధ్యతలు మాత్రమే ప్రైవేటు సంస్థలకు బదిలీ అవుతాయి. ఈ ప్రక్రియ ఇప్పుడు బిడ్డింగ్ దశకు చేరుకుంది.



స్థానిక ఎన్నికలు ఆలస్యమంటూ పుకార్లు.. ఏపీ ఎన్నికల సంఘం కీలక ప్రకటన



స్థానిక ఎన్నికల షెడ్యూల్ మరో 2 నెలలు ఆలస్యమంటూ వదంతులు

ఈ ప్రచారాన్ని కొట్టిపారేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం

అధికారిక ప్రకటనలనే నమ్మాలని ప్రజలకు, పార్టీలకు సూచన

తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తే చట్టపరమైన చర్యలు

తప్పవని హెచ్చరిక

వార్డుల పునర్విభజనపై ఇటీవల హైకోర్టు గ్రీన్ సిగ్నల్

అమరావతి (సామాన్యుడి అస్త్రం)

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు మరో రెండు నెలల సమయం పడుతుందంటూ వస్తున్న వార్తలను రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) తీవ్రంగా ఖండించింది. ఈ ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని రాష్ట్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా నేడు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో దీనిపై జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, ప్రజలు, రాజకీయ పార్టీలు వీటిని నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.ఓటర్ల జాబితాలు, రిజర్వేషన్లకు సంబంధించిన కోర్టు కేసులలో స్పష్టత వచ్చాకే కమిషన్ ఎన్నికల ప్రక్రియను ప్రారంభిస్తుందంటూ జరుగుతున్న ప్రచారం తమ దృష్టికి వచ్చిందని పునేఠా తెలిపారు. ఎన్నికలు ఆలస్యమైనా, అంతర్గత ఏర్పాట్లు ఇప్పటికే మొదలయ్యాయని కూడా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ వార్తలన్నీ కల్పితమైనవని, కమిషన్ అధికారికంగా జారీ చేసినవి కావని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు ఇలాంటి ధ్రువీకరణ లేని సమాచారాన్ని నమ్మడం గానీ, ఇతరులకు పంపడం గానీ చేయవద్దని సూచించారు.కమిషన్ పేరుతో తప్పుడు, కల్పిత సమాచారాన్ని ప్రచారం చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం హెచ్చరించింది. ఎన్నికల షెడ్యూల్‌కు సంబంధించి ఏదైనా ప్రకటన ఉంటే, అది కేవలం అధికారిక ప్రెస్ కాన్ఫరెన్స్ లేదా పత్రికా ప్రకటన ద్వారా మాత్రమే వెల్లడిస్తామని స్పష్టం చేసింది. వాట్సాప్, సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని అధికారిక వెబ్‌సైట్‌తో సరిచూసుకున్నాకే విశ్వసించాలని కోరింది.ఇటీవలే మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వార్డుల పునర్విభజనను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. దీంతో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఉన్న ప్రధాన న్యాయపరమైన అడ్డంకి తొలగిపోయింది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వార్డుల పునర్విభజన ప్రక్రియను తిరిగి ప్రారంభించింది. మరోవైపు, గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కూడా ఎస్ఈసీ సన్నాహాలు కొనసాగిస్తోంది. ఇప్పటికే సెప్టెంబర్ 23తో మండల ప్రజా పరిషత్‌లు, సెప్టెంబర్ 24తో జిల్లా ప్రజా పరిషత్‌ల ఐదేళ్ల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

సైబర్ స్టాకింగ్ పెరిగింది.. మహిళలు అప్రమత్తంగా ఉండాలి

సాంకేతికత వాడకంతో సైబర్ స్టాకింగ్ పెరిగిందన్న ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్

ఆన్‌లైన్ వేధింపులకు గురైతే కుటుంబసభ్యులకు చెప్పాలని మహిళలకు సూచన

హెల్ప్‌లైన్ నెంబర్లు 181, 112, 1930 గుర్తుంచుకోవాలని విజ్ఞప్తి

అమరావతి (సామాన్యుడి అస్త్రం)

టెక్నాలజీ వినియోగం పెరగడంతో భౌతిక వేధింపుల (ఫిజికల్ స్టాకింగ్) కంటే సైబర్ స్టాకింగ్ (ఆన్ లైన్ వేధింపులు) కేసులు ఎక్కువయ్యాయని, ఆన్‌లైన్ వేధింపుల పట్ల మహిళలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ సూచించారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జాతీయ మహిళా కమిషన్ సహకారంతో రాష్ట్ర మహిళా కమిషన్ నిర్వహించిన 'స్టాకింగ్ నివారణ' అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు.సోషల్ మీడియా, ఫోన్ కాల్స్, మెసేజ్‌ల ద్వారా వేధించడం, వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేయడం వంటివి పెరిగాయని శైలజ ఆందోళన వ్యక్తం చేశారు. ఒక నంబర్‌ను బ్లాక్ చేసినా కొత్త నంబర్ల నుంచి పదేపదే కాల్స్ లేదా మెసేజ్‌లు రావడం కూడా స్టాకింగ్ కిందకే వస్తుందని వివరించారు. అపరిచితుల నుంచి వచ్చే బహుమతులు, తమ ఫొటోలతో సృష్టించిన నకిలీ సోషల్ మీడియా ప్రొఫైళ్లు, వ్యక్తిగత ఫొటోల దుర్వినియోగంపై జాగ్రత్తగా ఉండాలన్నారు.వేధింపులకు గురైనప్పుడు సామాజిక అపవాదుకు భయపడకుండా వెంటనే తల్లిదండ్రులకు లేదా కుటుంబసభ్యులకు తెలియజేయాలని శైలజ సూచించారు. సకాలంలో ఫిర్యాదు చేయడం ద్వారా సమస్య తీవ్రం కాకుండా నివారించవచ్చన్నారు. ఫిర్యాదు చేసే సమయంలో మహిళా పోలీసు అధికారిని కోరే హక్కు, జీరో ఎఫ్ఐఆర్ ప్రాముఖ్యత గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని చెప్పారు. వీటితో పాటు మానసిక ధైర్యం కూడా చాలా అవసరమన్నారు.అత్యవసర పరిస్థితుల్లో 181 (మహిళా హెల్ప్‌లైన్), 112 (అత్యవసర సేవలు), 1930 (సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్) నంబర్లను, శక్తి యాప్‌ను ఉపయోగించుకోవాలని ఆమె మహిళలకు సలహా ఇచ్చారు

చంద్రబాబు విజన్, మోదీ సహకారంతో గ్రామీణ ప్రగతి పరుగులు పెడుతోంది: పవన్ కల్యాణ్

'పల్లె పండుగ 3.0' కార్యక్రమం ప్రారంభం

రూ.1.30 లక్షల కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడతామన్న పవన్

గత ప్రభుత్వంతో పోలిస్తే పది రెట్ల వేగంతో అభివృద్ధి చేస్తున్నామని వెల్లడి

రూ.11,085 కోట్లతో సీసీ, బీటీ రోడ్లు, మినీ గోకులాలు, పండ్ల తోటల నిర్మాణం

అభివృద్ధి పనుల నాణ్యతను ప్రజలే పర్యవేక్షించాలని పిలుపు



అమరావతి (సామాన్యుడి అస్త్రం)

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చే లక్ష్యంతో చేపట్టిన 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో మంగళవారం లాంఛనంగా ప్రారంభమైంది. రామాపురంలో జరిగిన ఈ భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. గ్రామీణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. రాబోయే సంవత్సరాల్లో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాల ద్వారా రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా రూ. 1.30 లక్షల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామని ప్రకటించారు.

గత ప్రభుత్వంతో పోలిస్తే పది రెట్ల అభివృద్ధి

ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వ పాలనతో ప్రస్తుత కూటమి ప్రభుత్వ పనితీరును పవన్ కల్యాణ్ పోల్చిచూపారు. "వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 880 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మిస్తే, మేము కేవలం రెండేళ్లలోనే దానికి పది రెట్లు ఎక్కువగా దాదాపు 9,000 కిలోమీటర్లకు పైగా పూర్తి చేశాం. వారు 304 మినీ గోకులాలు నిర్మిస్తే, మేము 30,000కు పైగా నిర్మించాం. 304 ఎక్కడ, 30,000 ఎక్కడో ప్రజలు ఆలోచించాలి" అని అన్నారు. సీఎం చంద్రబాబు దార్శనికత, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామీణ ప్రగతిని పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు.

రూ.11,085 కోట్లతో 'పల్లె పండుగ 3.0'

'పల్లె పండుగ 3.0' కార్యక్రమాన్ని రూ. 11,085 కోట్ల బడ్జెట్‌తో ప్రారంభిస్తున్నట్లు పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఇందులో కేంద్రం వాటా రూ. 5,400 కోట్లు కాగా, రాష్ట్ర ప్రభుత్వం రూ. 5,700 కోట్లు భరిస్తోందని వివరించారు. ఈ నిధులతో 6,000 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్లు, 22,500 మినీ గోకులాలు, 50 వేల ఎకరాల్లో పండ్ల తోటలు, వెయ్యి కిలోమీటర్ల డ్రైన్లు, గ్రామ పంచాయతీ భవనాలు, బస్ షెల్టర్లు, రచ్చబండలు వంటి అనేక పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. చారిత్రక ప్రాధాన్యత, వలసల సమస్య కారణంగానే ఉదయగిరిని ఈ కార్యక్రమానికి వేదికగా ఎంచుకున్నామని స్పష్టం చేశారు.

ఉదయగిరి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

ఉదయగిరి నియోజకవర్గానికి మహర్దశ పట్టబోతోందని పవన్ కల్యాణ్ అన్నారు. ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి గతంలో నిలిచిపోయిన సుజలా స్రవంతి పథకాన్ని రూ. 52 కోట్లతో పునరుద్ధరించి 381 పనులు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు. ఉదయగిరి కోటకు వెళ్లేందుకు రూ. 2.5 కోట్లతో రహదారి మంజూరు చేస్తున్నామని, అటవీ అనుమతులు త్వరగా పొందేలా అధికారులను ఆదేశిస్తున్నామని తెలిపారు. ఉదయగిరి కోటను హెరిటేజ్, ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు డీపీఆర్ సిద్ధం చేసి, కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా నిధులు సమీకరిస్తామని వెల్లడించారు.

అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ముఖ్యం

అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని, ఇందులో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. "మీ గ్రామంలో జరుగుతున్న పనులను ప్రజలు తమవిగా భావించి పర్యవేక్షించాలి. కాంట్రాక్టర్లు నాణ్యతగా పనిచేస్తున్నారా లేదా అని గమనించాలి. లోపాలు కనిపిస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. అవసరమైతే సోషల్ ఆడిట్ నిర్వహిస్తాం. వెచ్చించే ప్రతి రూపాయి సద్వినియోగం కావాలి" అని కోరారు. రైతుల కోసం డొంక రోడ్ల నిర్మాణానికి పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభిస్తున్నామని, గిరిజన ఆవాసాలకు రహదారి సౌకర్యం కల్పించడానికి ప్రాధాన్యత ఇస్తున్నామని పవన్ కల్యాణ్ వివరించారు. ఈ కార్యక్రమానికి అపూర్వ స్వాగతం పలికిన ప్రజలకు, విజయవంతం చేసిన అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

వివేకా హత్య కేసులో లబ్ధిదారుడు జగనే: మంత్రి అనగాని సత్యప్రసాద్



వివేకా హత్య కేసులో అంతిమ లబ్ధిదారుడు జగనేనన్న మంత్రి అనగాని

ఈడీ, సీబీఐ విచారణతో భయపడే ధర్నాల డ్రామాలు ఆడుతున్నారని ఆరోపణ

డైవర్షన్ రాజకీయాలు మాని నిజాలు చెప్పాలని జగన్‌కు డిమాండ్

ఉపాధ్యాయుడి మరణంపైనా వైసీపీ శవ రాజకీయం చేస్తోందని విమర్శ

సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ

అమరావతి (సామాన్యుడి అస్త్రం)

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అసలైన, అంతిమ లబ్ధిదారుడు మాజీ ముఖ్యమంత్రి జగనేనని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, ఈడీ, సీబీఐ దర్యాప్తు ముమ్మరం కావడంతో తాడేపల్లి ప్యాలెస్ పునాదులు కదులుతున్నాయని, అందుకే ప్రజల దృష్టిని మళ్లించేందుకు జగన్ ధర్నాల పేరిట డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు."సొంత బాబాయ్ గొడ్డలిపోటుకు గురైతే గుండెపోటుగా నమ్మించి, సాక్ష్యాలను తుడిచిపెట్టిన చరిత్ర జగన్‌ది. ఇప్పుడు కూడా అదే తరహాలో డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారు. అప్రూవర్‌గా మారిన దస్తగిరి, సునీల్ యాదవ్ వెల్లడించిన వాస్తవాలు, రూ. 40 కోట్ల సుపారీ లావాదేవీలన్నీ తాడేపల్లి నివాసం వైపే వేలెత్తి చూపిస్తున్నాయి" అని అనగాని పేర్కొన్నారు. హత్య కేసు దర్యాప్తు కీలక దశకు చేరుకోవడంతోనే డీఎస్సీ వంటి అంశాలపై వైసీపీ అనవసర రాద్ధాంతం చేస్తోందని ఆరోపించారు.అనారోగ్యంతో ఉన్న ఉపాధ్యాయుడు కాకుమాను రాజశేఖర్‌ను ధర్నాకు బలవంతంగా పిలిపించి, ఆయన మృతికి కారకులయ్యారని, ఇప్పుడు ఆ మరణంపై కూడా శవ రాజకీయం చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వమే రాష్ట్రంలో గంజాయి, బ్లేడ్ బ్యాచ్ సంస్కృతిని పెంచి పోషించిందని మండిపడ్డారు.తప్పులు చేస్తూ ఇతరులపై ఎదురుదాడికి దిగడం వైసీపీకి అలవాటుగా మారిందని, ఆ పార్టీ తన పేరును 'గొడ్డలి డైవర్షన్ పార్టీ'గా మార్చుకుంటే బాగుంటుందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా జగన్ మీడియా ముందుకు వచ్చి వివేకా హత్యపై వాస్తవాలను వెల్లడించాలని అనగాని సత్యప్రసాద్ డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలను కూడా తమ ప్రభుత్వం పరిష్కరించి, వారికి ఉజ్వల భవిష్యత్తును అందిస్తుందని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

రాష్ట్రంలో పటిష్ఠ శాంతిభద్రతల వల్లే పెట్టుబడులు వస్తున్నాయి: మంత్రి అచ్చెన్న

శ్రీకాకుళంలో కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొన్న అచ్చెన్నాయుడు

గత 8 నెలల్లో 5,800 పోలీసు పోస్టులు భర్తీ చేశామని వెల్లడి

మరో 1,156 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చామన్న అచ్చెన్నాయుడు

అమరావతి (సామాన్యుడి అస్త్రం)

రాష్ట్ర ప్రగతికి శాంతిభద్రతలే పునాది అని, ఆంధ్రప్రదేశ్‌లో లా అండ్ ఆర్డర్ పటిష్ఠంగా ఉండటం వల్లే పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షించగలుగుతున్నామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో జరిగిన కానిస్టేబుళ్ల పాసింగ్-అవుట్ పరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పై వ్యాఖ్యలు చేశారు.10 నెలల కఠిన శిక్షణ పూర్తి చేసుకున్న 142 మంది నూతన కానిస్టేబుళ్లను మంత్రి అభినందించారు. పోలీసు వృత్తిలోకి అడుగుపెడుతున్న వారికి శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు ఉద్యోగం కేవలం జీవనోపాధి మాత్రమే కాదని, సమాజానికి సేవ చేసే గొప్ప బాధ్యత అని గుర్తుచేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు సిబ్బంది అంకితభావం, క్రమశిక్షణతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు

వృద్ధాప్యంపై మీ ఆలోచనే మీ ఆరోగ్యం..



వృద్ధాప్యంపై సానుకూల దృక్పథం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది

యేల్ యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడైన కీలక విషయాలు

45 శాతం మంది వృద్ధుల్లో మెరుగైన జ్ఞాపకశక్తి, శారీరక సామర్థ్యం

వయసు పెరిగినా చురుకైన మెదడు, వేగవంతమైన నడక

వృద్ధాప్యంలో ఆరోగ్యం క్షీణించడం కాదు.. మెరుగుపడటం కూడా సాధారణమే

వయసు పైబడటం అంటే కేవలం ఆరోగ్యం క్షీణించడమే అనే సాధారణ భావనను సవాలు చేస్తూ యేల్ యూనివర్సిటీ ఒక కీలక అధ్యయనాన్ని వెల్లడించింది. వృద్ధాప్యంపై సానుకూల దృక్పథం కలిగిన వారిలో జ్ఞాపకశక్తి, శారీరక సామర్థ్యం మెరుగుపడినట్లు ఈ పరిశోధనలో తేలింది. వృద్ధులలో సగం మందికి పైగా ఆరోగ్యంలో పురోగతి సాధిస్తున్నారని, వయసు పెరగడం అంటే అది కేవలం అనివార్యమైన క్షీణత మాత్రమే కాదని ఈ అధ్యయనం స్పష్టం చేసింది.ప్రముఖ అంతర్జాతీయ జర్నల్ 'జెరియాట్రిక్స్'లో ప్రచురితమైన ఈ అధ్యయనం కోసం, 65 ఏళ్లకు పైబడిన 11,000 మందికి పైగా అమెరికన్ల ఆరోగ్య సమాచారాన్ని 12 ఏళ్ల పాటు విశ్లేషించారు. వీరిలో దాదాపు 45.15 శాతం మందిలో మెదడు పనితీరు లేదా శారీరక చురుకుదనంలో స్పష్టమైన మెరుగుదల కనిపించింది. సుమారు 32 శాతం మందిలో జ్ఞాపకశక్తి, 28 శాతం మందిలో నడక వేగం పెరిగినట్లు గుర్తించారు. వృద్ధుల ఆరోగ్యానికి నడక వేగాన్ని ఒక ముఖ్య సూచికగా పరిగణిస్తారు.ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన యేల్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ప్రొఫెసర్ డాక్టర్ బెక్కా ఆర్. లెవీ మాట్లాడుతూ, "చాలామంది వృద్ధాప్యాన్ని శారీరక, మానసిక సామర్థ్యాలు క్షీణించే ఒక అనివార్య ప్రక్రియగా భావిస్తారు. కానీ వృద్ధాప్యంలో ఆరోగ్యం మెరుగుపడటం అరుదైన విషయం కాదు, అది చాలా సాధారణం" అని స్పష్టం చేశారు.అధ్యయనం ప్రారంభంలో వృద్ధాప్యంపై ఎవరైతే సానుకూల అభిప్రాయం కలిగి ఉన్నారో, వారిలోనే ఈ మెరుగుదల ఎక్కువగా కనిపించింది. వయసు, లింగం, విద్య, దీర్ఘకాలిక వ్యాధులు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత కూడా ఇదే ఫలితం రావడం గమనార్హం. సమాజంలో వృద్ధాప్యంపై ఉండే నమ్మకాలు వ్యక్తుల జీవక్రియలు, పనితీరుపై ప్రభావం చూపుతాయన్న సిద్ధాంతానికి ఈ ఫలితాలు బలం చేకూరుస్తున్నాయి. వ్యాయామం, సరైన ఆహారం వంటి సంప్రదాయ పద్ధతులతో పాటు సానుకూల ఆలోచనలను ప్రోత్సహించడం ద్వారా వృద్ధులలో ఆరోగ్యకరమైన జీవితాన్ని పెంపొందించవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఒక కప్పు బఠానీలు.. అన్నాన్ని ఫైబర్ పవర్‌హౌస్‌గా మార్చేస్తాయి!

అన్నంలో ఒక కప్పు బఠానీలు కలిపితే ఫైబర్ పెరుగుతుంది

దాదాపు 10 గ్రాముల ఫైబర్, 8.6 గ్రాముల ప్రోటీన్ లభిస్తాయి

రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉండటానికి సాయపడుతుంది

ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉంచుతుంది

గట్ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది



మన రోజువారీ ఆహారంలో ఎక్కువగా కనిపించే పోషక లోపాల్లో ఫైబర్ ఒకటి. జీర్ణక్రియ సక్రమంగా సాగడం, గట్ ఆరోగ్యం మెరుగుపడడం, రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉండడం, ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలగడం వంటి అనేక ప్రయోజనాలకు ఫైబర్ కీలకం. అయినప్పటికీ చాలామంది అవసరమైనంత ఫైబర్‌ను తీసుకోవడం లేదు.అయితే ఫైబర్ పెంచుకోవడానికి ఆహారపు అలవాట్లను పూర్తిగా మార్చాల్సిన అవసరం లేదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఒక చిన్న మార్పు రోజువారీ భోజనాన్ని మరింత పోషకమయంగా మార్చగలదని చెబుతున్నారు.

అన్నంలో బఠానీలు

సాధారణంగా తినే అన్నంలో ఒక కప్పు పచ్చి బఠానీలు కలిపితే ఆ భోజనంలో దాదాపు 10 గ్రాముల ఫైబర్, 8.6 గ్రాముల ప్రోటీన్ లభిస్తాయని నిపుణులు తెలిపారు. దీంతో ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉండటమే కాకుండా రక్తంలో చక్కెర స్థాయిలు కూడా స్థిరంగా ఉండేందుకు సాయపడుతుంది.అంతేకాదు, గట్ ఆరోగ్యం మెరుగుపడటంలో కూడా ఈ అలవాటు ఉపయోగపడుతుందని ఆమె వివరించారు. తాజా బఠానీలు అందుబాటులో లేకపోతే ఫ్రోజన్ బఠానీలు కూడా ఉపయోగించవచ్చని సూచించారు.
రోజువారీ ఆహారంలో ఫైబర్ పెంచుకోవాలంటే..
తెల్ల బియ్యం, మైదా పదార్థాల బదులు బ్రౌన్ రైస్, మల్టీగ్రెయిన్ లేదా పప్పు ధాన్యాలను ఎంచుకోవాలి. శనగలు, పెసర్లు, మినుములు, రాజ్మా వంటి వాటిని కూరలు, సలాడ్లలో చేర్చాలి. ఓట్స్, చియా గింజలు, పండ్లతో కూడిన అల్పాహారం తీసుకోవడం మంచిది. యాపిల్, పియర్ వంటి పండ్లను తొక్కతోనే తినడం, బాదం, పిస్తా వంటి డ్రైఫ్రూట్స్‌ను మధ్యాహ్నం స్నాక్స్‌గా తీసుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది.

చిన్న మార్పు.. పెద్ద ప్రయోజనం5

ఆరోగ్యకరమైన ఆహారం అంటే ఖరీదైన పదార్థాలు తినాల్సిన అవసరం లేదు.

మనం తినే 'మటన్' అసలు మటనేనా?.. విదేశాల్లో అర్థం పూర్తిగా వేరు!


భారత్‌లో మటన్ అంటే సాధారణంగా మేక మాంసాన్ని సూచిస్తున్న వైనం

యూకే, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో మటన్ అంటే పెద్ద గొర్రె మాంసం

ఫ్రెంచ్ పదం 'మౌటన్' (గొర్రె) నుంచి వచ్చిన 'మటన్' అనే పదం

భారత్‌లో మేకల వినియోగం, పెంపకం ఎక్కువ కావడం వల్లే ఈ పేరు స్థిరపడిన వైనం

బ్రిటిష్ పాలనలో ఈ పదం వాడుకలోకి వచ్చి, స్థానిక మాంసానికి వర్తించింది



భారత్‌లోని ఏ రెస్టారెంట్‌కు వెళ్లినా, మాంసం దుకాణానికి వెళ్లినా 'మటన్' అని అడిగితే మనకు దొరికేది దాదాపుగా మేక మాంసమే. ఘుమఘుమలాడే మటన్ కూరల నుంచి బిర్యానీలు, కబాబ్‌ల వరకు ఈ పదం మన ఆహారపు అలవాట్లలో విడదీయరాని భాగమైపోయింది. కానీ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ప్రపంచంలోని అనేక ఇతర దేశాల్లో 'మటన్' అంటే మేక మాంసం కాదు, దానికి అర్థం పూర్తిగా భిన్నంగా ఉంటుంది. మరి భారతీయులు ఈ పదాన్ని ఎందుకు భిన్నంగా వాడతారు? దీని వెనుక చారిత్రక, భాషా, వలసవాద ప్రభావాలతో పాటు శతాబ్దాలుగా మారుతున్న మన ఆహారపు అలవాట్లు ఉన్నాయి. అసలు 'మటన్' అనే పదానికి ప్రపంచవ్యాప్తంగా వేర్వేరు అర్థాలు ఎలా వచ్చాయో వివరంగా చూద్దాం.

ఒకే పదం.. విభిన్న అర్థాలు

భారతదేశంలో 'మటన్' అనే పదాన్ని సాధారణంగా మేక మాంసానికి ప్రత్యామ్నాయంగా వాడతారు. స్థానిక కబేళాలో కొనుగోలు చేసినా, రెస్టారెంట్‌లో ఆర్డర్ చేసినా, మెనూలో ప్రత్యేకంగా పేర్కొనకపోతే మనకు లభించేది మేక మాంసమే. కానీ, ఈ వాడుక ప్రపంచవ్యాప్తంగా లేదు. యూకే, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో 'మటన్' అంటే ప్రత్యేకంగా పెద్ద గొర్రె మాంసాన్ని మాత్రమే సూచిస్తుంది. లేత గొర్రెపిల్ల మాంసాన్ని 'ల్యామ్' అని పిలుస్తారు. ఇక మేక మాంసాన్ని కేవలం 'గోట్ మీట్' అని అంటారు. ఈ పదజాలంలోని వ్యత్యాసం వల్లే విదేశాలకు వెళ్లే భారతీయులు మాంసం ఆర్డర్ చేసేటప్పుడు తరచుగా గందరగోళానికి గురవుతారు. దక్షిణాసియాలోని కొన్ని ప్రాంతాలలో, ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో, స్థానిక వినియోగాన్ని బట్టి 'మటన్' అంటే గొర్రె, మేక రెండింటినీ సూచించే సందర్భాలు కూడా ఉన్నాయి.

'మటన్' పదం ఎక్కడి నుంచి వచ్చింది?

'మటన్' అనే పదానికి మూలాలు పాత ఫ్రెంచ్ పదం 'మోటాన్' (ఎశీఓశీఅ)లో ఉన్నాయి. దీని అర్థం 'గొర్రె'. 1066లో నార్మన్లు ఇంగ్లండ్‌ను జయించిన తర్వాత, ఫ్రెంచ్ భాషా ప్రభావం ఇంగ్లీష్ ఆహార పదజాలంపై బలంగా పడింది. ఆ క్రమంలోనే ఈ పదం ఆంగ్లంలోకి ప్రవేశించింది. ఆవు మాంసాన్ని 'బీఫ్' అని, పంది మాంసాన్ని 'పోర్క్' అని పిలవడం వెనుక కూడా ఇదే కారణం. చారిత్రాత్మకంగా ఆంగ్లంలో 'మటన్' అంటే గొర్రె మాంసమే. అయితే, యూరప్ వెలుపల కొన్ని ప్రాంతాలలో మేక మాంసానికి కూడా ఈ పదాన్ని వాడినట్లు చారిత్రక ఆధారాలున్నాయి.

భారత్‌లో మేక మాంసాన్ని 'మటన్' అని ఎందుకంటారు?

దీనికి సమాధానం కేవలం భాషలో కాదు, మన ఆహార సంస్కృతి, భౌగోళిక పరిస్థితులు, చారిత్రక అవసరాలలో దాగి ఉంది. భారతదేశంలో శతాబ్దాలుగా అత్యధికంగా వినియోగించే మాంసాలలో మేక ఒకటి. గొడ్డు మాంసం లేదా పంది మాంసంలా కాకుండా, దాదాపు అన్ని మత వర్గాలు మేక మాంసాన్ని స్వీకరిస్తాయి. దీంతో ఇది ఇళ్లలో, హోటళ్ల మెనూలలో ఒక సాధారణ ఎంపికగా మారింది. అంతేకాకుండా, దేశంలోని చాలా ప్రాంతాల్లో మేకల పెంపకం కూడా సులభం. తక్కువ స్థలంలో, విభిన్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా జీవించడం, చిన్న తరహా రైతులకు సైతం ఆచరణీయంగా ఉండటంతో, తరతరాలుగా ఇది ప్రధాన మాంసాహార వనరుగా నిలిచింది.బ్రిటిష్ వలస పాలన సమయంలో, ఆంగ్ల ఆహార పదాలు భారతీయ మార్కెట్లలోకి, వంటశాలల్లోకి ప్రవేశించాయి. అప్పటికే భారత్‌లో విస్తృతంగా అందుబాటులో ఉన్న మేక మాంసానికి, గొర్రె మాంసానికి వాడే 'మటన్' అనే ఆంగ్ల పదం స్థిరపడిపోయింది. కసాయి దుకాణాలు, రెస్టారెంట్లు, గృహ వినియోగంలో ఈ వాడుక విస్తరించడంతో, అది మన దైనందిన భాషలో భాగమైంది. అందుకే భారత్‌లో మటన్ కూర, మటన్ బిర్యానీ, మటన్ రోగన్ జోష్ వంటి వంటకాలన్నీ, ప్రత్యేకంగా చెబితే తప్ప, మేక మాంసంతోనే తయారు చేస్తారు.

మేక మాంసానికి అధికారిక పేరు ఉందా?

అవును, ఉంది. పాకశాస్త్ర పరిభాషలో మేక మాంసాన్ని 'చెవన్' (జష్ట్రవఅఱశీఅ) అని పిలుస్తారు. 20వ శతాబ్దంలో పేరును ప్రామాణీకరించడానికి ఫ్రెంచ్ నుంచి ఈ పదాన్ని స్వీకరించారు. లేత మేకపిల్ల మాంసాన్ని కొన్నిసార్లు 'క్యాబ్రిటో' (జ్ఞుఎతీఱ్ఱశీ) అని కూడా అంటారు. అయితే, ఈ పదాలు రోజువారీ సంభాషణలో చాలా అరుదుగా వినిపిస్తాయి. పాశ్చాత్య దేశాల్లో కూడా 'గోట్ మీట్' అనే పదమే ఎక్కువగా వాడుకలో ఉంది.కాబట్టి తదుపరిసారి ఎవరైనా మటన్ అంటే గొర్రె మాంసం అని చెబితే వారు చెప్పింది తప్పని అనలేం. అలాగే, ఒక భారతీయుడు మటన్ వండుతున్నానని చెబితే, అది మేక మాంసమేనని అర్థం చేసుకోవాలి. ఈ వ్యత్యాసం ఒక పొరపాటు కాదు, శతాబ్దాలుగా చరిత్ర, వలసవాద ప్రభావం, స్థానిక ఆహారపు అలవాట్లు, సాంస్కృతిక ప్రాధాన్యతల కలయికతో ఏర్పడిన ఒక ఆసక్తికరమైన పరిణామం. ప్రజలు వారసత్వంగా పొందిన పదాల కంటే, వారు తినే ఆహారమే భాషను ఎలా మలుస్తుందో చెప్పడానికి ఇదొక చక్కటి ఉదాహరణ.

మీ శరీరంలో ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా? అయితే ప్రొటీన్ తక్కువైనట్లే!

కండరాల నిర్మాణం, రోగనిరోధక శక్తికి ప్రొటీన్ కీలకం

తరచూ ఆకలి వేస్తే ప్రొటీన్ లోపం కావచ్చు

ఎప్పుడూ అలసట, బలహీనత కూడా ప్రొటీన్ కొరతకు సంకేతమే

కండరాల బలం తగ్గడం, జుట్టు రాలడం వంటి లక్షణాలు కనిపించొచ్చు

గాయాలు ఆలస్యంగా మానడం కూడా ప్రొటీన్ లోపాన్ని సూచన



ప్రొటీన్ మన శరీరానికి అత్యంత కీలకమైన పోషకాల్లో ఒకటి. కండరాల నిర్మాణం, దెబ్బతిన్న కణజాల మరమ్మతు, హార్మోన్లు, ఎంజైమ్‌ల ఉత్పత్తి, రోగనిరోధక శక్తి పెంపులో ఇది ప్రధాన పాత్ర పోషిస్తుంది. శరీరానికి అవసరమైనంత ప్రొటీన్ అందకపోతే కొన్ని స్పష్టమైన సంకేతాలు కనిపిస్తాయి. వాటిని నిర్లక్ష్యం చేయకుండా ఆహారపు అలవాట్లను మార్చుకోవడం అవసరం.

ఎప్పుడూ ఆకలి

: ప్రొటీన్ ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలిగిస్తుంది. భోజనం చేసిన కొద్దిసేపటికే మళ్లీ ఆకలి వేస్తుంటే ప్రొటీన్ తక్కువగా తీసుకుంటున్నారనే సంకేతం కావచ్చు.

అలసట:

రోజంతా నీరసంగా, బలహీనంగా అనిపించడం కూడా ప్రొటీన్ లోపానికి సంకేతమే. శరీరానికి అవసరమైన శక్తి, కండరాల పనితీరు దెబ్బతింటుంది.
కండరాల బలం తగ్గడం: మెట్లు ఎక్కడం, బరువులు ఎత్తడం వంటి సాధారణ పనులు కూడా కష్టంగా అనిపిస్తే కండరాలకు అవసరమైన ప్రొటీన్ అందడం లేదని భావించవచ్చు.

జుట్టు రాలిపోవడం

: జుట్టులో ప్రధాన భాగం ప్రొటీనే. అందువల్ల దీని లోపం ఉంటే జుట్టు రాలడం, పలచబడడం వంటి సమస్యలు పెరుగుతాయి.

బలహీనమైన గోర్లు:

చిన్న దెబ్బకే గోర్లు విరిగిపోవడం, పెళుసుగా మారడం కూడా ప్రొటీన్ లోపానికి సూచన కావచ్చు.
గాయాలు మానకపోవడం: కణజాలం పునర్నిర్మాణానికి ప్రొటీన్ అవసరం. అందువల్ల గాయాలు లేదా కోతలు త్వరగా మానకపోతే ప్రొటీన్ లోపం ఉండే అవకాశం ఉంది.

తరచూ అనారోగ్యం:

రోగనిరోధక వ్యవస్థకు ప్రొటీన్ కీలకం. ఇది తక్కువగా ఉంటే తరచూ జలుబు, ఇన్‌ఫెక్షన్ల వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది.

గమనిక:

ఈ లక్షణాలు ప్రొటీన్ లోపం వల్ల మాత్రమే వస్తాయని నిర్ధారించలేం. ఇవి ఇతర ఆరోగ్య సమస్యల వల్ల కూడా రావచ్చు. ఇలాంటి లక్షణాలు తరచూ ఉంటే వైద్యులను సంప్రదించడం మంచిది.

వీటితో సంపూర్ణ ఆరోగ్యం.. రోజూ గుప్పెడు తింటే చాలు!

ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం ఖరీదైన ఆహారాలే అవసరం లేదు. మన వంటింట్లో ఉండే శనగలతోనే ఎన్నో అద్భుతమైన ప్రయోజనాలు పొందవచ్చు. ప్రోటీన్లు, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉండే శనగలను పోషకాల గనిగా చెప్పవచ్చు. వీటిని రోజూవారీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలకు దూరంగా ఉండొచ్చు.శనగలు శరీరానికి తక్షణ శక్తిని అందించడంలో ముందుంటాయి. వీటిలో ఉండే ప్రోటీన్లు, పీచుపదార్థం (ఫైబర్) జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తాయి. మలబద్ధకం వంటి సమస్యలను నివారించి, జీర్ణక్రియ సాఫీగా సాగేలా చేస్తాయి. ముఖ్యంగా, గుండె ఆరోగ్యానికి శనగలు ఎంతగానో మేలు చేస్తాయి. రక్తంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, గుండె జబ్బుల ముప్పును దూరం చేస్తాయి.మధుమేహంతో బాధపడేవారికి శనగలు ఒక వరంలాంటివి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తాయి. అంతేకాకుండా, వీటిలో ఉండే పోషకాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. బరువు తగ్గాలనుకునే వారికి కూడా శనగలు మెరుగైన ఎంపిక. కొద్దిగా తిన్నా కడుపు నిండిన భావన కలిగించి, అనవసరమైన తిండి తినకుండా నియంత్రిస్తాయి. అందుకే ఆరోగ్య నిపుణులు ప్రతిరోజూ కనీసం గుప్పెడు శనగలు

అదే అసలైన ప్రేమ!

తన పేరుకు తగ్గట్టు అందచందాల ప్రదర్శనతో నెట్టింట సెగలు పుట్టిస్తోంది టాలీవుడ్ బ్యూటీ రాశి ఖన్నా. ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం సూపర్ స్టార్ రజనీకాంత్ 'ధర్మన్' సినిమా) షూటింగ్‌లో పాల్గొంటోంది. ఎంత బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండటం రాశీఖన్నాకు అలవాటు. తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా వేదికగా అభిమాను లతో చిట్‌చాట్ నిర్వహించిందీ చిన్నది. ఈ సందర్భంగా ఫ్యాన్స్ అడిగిన ప్రశ్నలకు చాలా ఓపెన్‌గా సమాధానాలిచ్చింది."నాకు ఒంటరితనంగా అనిపించినప్పుడు ఆ భాధను ఎక్కడా దాచుకోకుండా పూర్తిగా అనుభవిస్తాను. దానివల్ల కళ్లలో నీళ్లు తిరిగితే తిరగనీస్తాను, ఆ భావాలను అణచివేయకుండా సహజంగా ప్రవహనిస్తాను. వాటితో అనవసరంగా పోరాడను. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు ఓషో బోధనల నేను నేర్చుకున్న ఓ గొప్ప పాఠం నా జీవితంలో ఎప్పటికీ గుర్తుంటుంది. ప్రేమ అంటే ఎవరినీ కంట్రోల్ చేయడం కాదు, వారికి పూర్తి స్వేచ్ఛనివ్వడమే. ప్రేమ ఎప్పుడైతే స్వచ్ఛమైన స్వేచ్ఛను ఇస్తుందో అదే అసలైన ప్రేమ అవుతుంది.కేవలం మనం ప్రేమిస్తున్నామన్న ఒక్క కారణంతో అవతలి వాళ్లను మనతోనే ఉండాలని ఎప్పుడూ బలవంతం చేయకూడదు. అవతలి వ్యక్తులను వారి సొంత నిర్ణయం తీసుకోనివ్వాలి, అదే సమయంలో మనం మన వ్యక్తిత్వాన్ని కోల్పోకుండా ఎదుగుతూనే ఉండాలి"



నవ్వులు పంచే 'గోల్డెన్ భాగ్యం'



హాస్యనటులు సత్య), యోగిబాబు) కలిసి ఓ కొత్త కామెడీ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'రంగబలి(' ఫేమ్ పవన్ బాసంశెట్టి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. డ్రీమ్ మూవీ మేకర్స్, నయవాయు చిత్రాలు బ్యానర్లపై నాగార్జునరెడ్డి, పవన్ బాసంశెట్టి నిర్మిస్తున్నారు. తాజాగా చిత్రబృందం ఈ మూవీ టైటిల్ రివీల్ గ్లింప్స్‌ను విడుదల చేసింది. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా ఎలా ఉండబోతుందో ఈ గ్లింప్స్ ద్వారా పరిచయం చేశారు. ఈ వీడియోలో సత్య, యోగిబాబు వైట్ అండ్ వైట్ ట్రెడిషనల్ లుక్‌లో స్టైలిష్‌గా ఎంట్రీ ఇచ్చారు.వీరి కథలో ప్రేమ, క్రైమ్, యాక్షన్ అంశాలు మిళితమై ఉంటాయని వెల్లడిస్తూ, సినిమా టైటిల్‌ను 'గోల్డెన్ భాగ్యం'గా రివీల్ చేశారు.

'సత్య' పాత్రతోనే గుర్తింపు



»Student No.1' సినిమా విడుదలై 25 ఏళ్లు పూర్తైన సందర్భంగా నటుడు రాజీవ్ కనకాల తన జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సినిమా తన జీవితంలో ఒక ప్రత్యేక అధ్యాయమని అన్నారు. ఈ చిత్రం తర్వాతే పూర్తిగా సినిమాల్లోకి వచ్చానని, 'సత్య' పాత్రతో ప్రేక్షకులకు దగ్గరయ్యానని గుర్తుచేసుకున్నారు.ఇప్పటికీ ఎక్కడికి వెళ్లినా 'సత్య' పాత్ర గురించి ప్రేక్షకులు గుర్తుచేసుకుని మాట్లాడటం తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తుందని తెలిపారు. ఈ ప్రయాణంలో తనకు ఎంతో ఇచ్చిన శ్రీ రాజమౌళి, కె. రాఘవేంద్రరావు, ఎం.ఎం. కీరవాణి, వినోద్‌తో పాటు చిత్ర బృందంలోని ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

తత్వం కథే మా ధైర్యం



దినేశ్‌తేజ్ దష్నిక కే హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'తత్వం(' అర్జున్ కోలా దర్శకత్వంలో త్రయతి ఇషాని క్రియేషన్స్(), ఎస్‌కే ప్రొడక్షన్స్ బ్యానర్లపై శీమకుర్తి వంశీకృష్ణ, శ్వేత పసుపులేటీ ఈ చిత్రాన్ని నిర్మించారు. అక్టోబర్ 2న థ్రియేటికల్ విడుదలకు సిద్ధమైన ఈ మూవీ ప్రీరిలీజ్ వేడుక మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా హీరో దినేశ్ తేజ మాట్లాడుతూ.. "కొత్తదనం ఉన్న సినిమాలను తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తుంటారు. తప్పకుండా ఈ సినిమాకూ అదే కోవలో విజయాన్ని ఇస్తారని అనుకుంటున్నా. ఈ సినిమాకు కథే మా ధైర్యం, ప్రేక్షకులే మా బలంఇలాంటి సినిమాలు విజయం సాధిస్తే మా అందరిలో కూడా నమ్మకం కలుగుతుంది. ఈ సినిమా క్లైమాక్స్ అందరి మనసులను తాకుతుంది" అన్నారు. 'తప్పకుండా ఈ సినిమా అందరికి నచ్చుతుంది. మా అందరికి ప్రేక్షకుల ప్రోత్సాహం ఉంటుందని అనుకుంటున్నాన'ని హీరోయిన్ దష్నిక తెలిపింది.

కీర్తి సురేశ్, రాధికా ఆప్టే 'అక్క'.. స్ట్రీమింగ్ డేట్ ఫిక్స్?



కీర్తి సురేశ్, రాధికా ఆప్టే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'అక్క' వెబ్ సిరీస్‌పై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. యశ్ రాజ్ ఫిల్మ్స్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ పీరియడ్ థ్రిల్లర్ విడుదల తేదీకి సంబంధించి ఒక ఆసక్తికర వార్త నెట్టింట వైరల్ అవుతోంది. సింగపూర్‌కు చెందిన ఒక మీడియా సంస్థ కథనం ప్రకారం, ఈ సిరీస్ 2026 అక్టోబర్ 30న నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. అయితే, ఈ అంశంపై నెట్‌ఫ్లిక్స్ గానీ, నిర్మాణ సంస్థ గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.ఈ సిరీస్ కథాంశం 1980ల నాటి నేపథ్యంలో సాగుతుంది. దక్షిణ భారతదేశంలోని 'పెర్నూరు' అనే కల్పిత పట్టణంలో ఈ కథను అల్లారు. ఈ పట్టణం పూర్తిగా మహిళల ఆధిపత్యంలో ఉండటం గమనార్హం. రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాలన్నీ వారి నియంత్రణలోనే ఉంటాయి. ఇక్కడ 'అక్కలు'గా పిలవబడే ఒక శక్తివంతమైన మహిళా బృందం, పట్టణంలోని అక్రమ బంగారం రవాణా వ్యాపారాన్ని శాసిస్తుంటుంది. తమ సంపదను, గౌరవాన్ని కాపాడుకోవడానికి ప్రత్యేకంగా శిక్షణ పొందిన మహిళా సైన్యంతో, భయం, విధేయత పునాదులపై వారు తమ సామ్రాజ్యాన్ని ఏలుతుంటారు.ఇటువంటి పరిస్థితుల్లో, వ్యక్తిగత పగతో ఒక అపరిచితుడు ఆ పట్టణంలోకి అడుగుపెడతాడు. అక్కల మధ్య ఉన్న అంతర్గత విభేదాలను, వైరాన్ని తనకు అనుకూలంగా మార్చుకుని వారి ఆధిపత్యాన్ని సవాలు చేస్తాడు. దీంతో నమ్మకద్రోహాలు, హింస చోటుచేసుకుని, అధికారం కోసం భీకరమైన పోరాటం మొదలవుతుంది. ఈ శక్తివంతమైన పత్రాల్లో కీర్తి సురేశ్, రాధికా ఆప్టే నటిస్తుండగా, సీనియర్ నటి తన్వి అజ్మీ ఒక కీలక పాత్రలో కనిపిస్తారు.గతేడాది (2025) విడుదలైన ఈ సిరీస్ ఫస్ట్ లుక్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది.

"గర్భవతా?".. పారిస్‌లో ఐశ్వర్యరాయ్ లుక్‌పై ట్రోలింగ్

మరోసారి తనదైన ముద్ర వేశారు. అయితే, ఈ ప్రతిష్ఠాత్మక వేదికపై ఆమె నడకను ప్రశంసించే వారికంటే, ఆమె శరీరాకృతిని విమర్శించే వారే ఎక్కువగా కనిపించారు. లోరియల్ పారిస్ నిర్వహించిన షోలో పాల్గొన్న ఐశ్వర్య, ఆ తర్వాత సోషల్ మీడియాలో తీవ్రమైన బాడీ షేమింగ్‌కు గురయ్యారు.పారిస్‌లోని ప్లేస్ జోఫ్రీలో, ఈఫిల్ టవర్ నేపథ్యంగా సెప్టెంబర్ 28న లోరియల్ పారిస్ 'వాక్ యువర్ వర్త్' థీమ్‌తో ఓ ఫ్యాషన్ షోను నిర్వహించింది. మహిళల ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వం, వైవిధ్యానికి ప్రాధాన్యతనిస్తూ ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఇందులో లోరియల్‌కు దశాబ్దాలుగా ప్రచారకర్తగా ఉన్న ఐశ్వర్య రాయ్, నల్లటి వెల్వెట్



దుస్తులు, తలపై కిరీటం, రెడ్ హెయిర్, బోల్డ్ రెడ్ లిప్‌స్టిక్‌తో ర్యాంప్‌పై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆమెతో పాటు కెండల్ జెన్నర్, ఇవా లాంగోరియా, కారా డెలివింగ్నే వంటి అంతర్జాతీయ తారలు కూడా ఈ షోలో పాల్గొన్నారు.అయితే, ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు ఆన్‌లైన్‌లో వైరల్ అయిన వెంటనే, కొందరు నెటిజన్లు ఐశ్వర్య శరీరాకృతిని లక్ష్యంగా చేసుకుని అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రారంభించారు. "ఆమె గర్భవతా?", "పొట్ట కనిపిస్తోంది" అంటూ కొందరు కామెంట్స్ చేయగా, మరికొందరు "స్రెక్‌లోని ఫియోనాలా ఉంది" వంటి దారుణమైన పోలికలు తెచ్చారు. ఆమె బరువు, దుస్తులు, మేకప్‌పై కూడా విమర్శలు గుప్పించారు.మహిళా సాధికారతను చాటిచెప్పే వేదికపైనే ఒక మహిళను శారీరకంగా కించపరిచేలా వ్యాఖ్యలు రావడం తీవ్ర విమర్శలకు దారితీసింది.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.